

నెలాఖరులోగా ఆస్తి పన్ను చెల్లిస్తే 5 శాతం రిబేటు

ఎలమంచిలి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2025-26) సంబంధించి మొత్తం ఆస్తి పన్నును ఈ నెలాఖరులోగా చెల్లిస్తే ఐదు శాతం రిబేటు వర్తిస్తుందని ఎలమంచిలి మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పన్ను డిమాండ్ నోటీసులు ఆన్‌లైన్‌లో విడుదల అయ్యాక ఈఆర్‌పీ ద్వారా పన్ను చెల్లింపు ఆప్షన్ వస్తుందని, ఈ నెల 6వ తేదీ నుంచి పన్ను చెల్లించవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని పట్టణవాసులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జిల్లాలో మరో బల్క్ డ్రగ్ పార్క్

- 500 ఎకరాల్లో రూ.5 వేల కోట్లతో నిర్మాణం
- 7,500 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- సీఎం చంద్రబాబును కలిసిన కంపెనీ సీఈవో, వైస్ ప్రెసిడెంట్
- భూమి కేటాయించాలని వినతి, డీపీఆర్ అందజేత

రాంబిల్లి మండలంలో ఏర్పాటుకు ముందుకు వచ్చిన లారస్ ల్యాబ్స్


రాంబిల్లి మండలంలో బల్క్ డ్రగ్ పార్క్ కోసం లారస్ ల్యాబ్స్‌కు కేటాయించేందుకు పరిశీలనలో ఉన్న భూమి

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో మరో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు కానున్నది. ఇప్పటికే నక్కపల్లి మండలంలో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుకు ప్రభుత్వం భూములు, నిధులు కేటాయించగా, తాజాగా రాంబిల్లి మండలంలో ప్రైవేటు రంగంలో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు కానున్నది. ప్రముఖ ఫార్మా కంపెనీ లారస్ ల్యాబ్స్ ముందుకు వచ్చింది. సుమారు రూ.5 వేల కోట్లతో ఏర్పాటయ్యే బల్క్ డ్రగ్ పార్కులో దాదాపు ఏడున్నర వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పరిశ్రమల ఏర్పాటులో అనకాపల్లి జిల్లాకు అధిక ప్రాధాన్యం ఇస్తున్న విషయం తెలిసింది. గత వైసీపీ ప్రభుత్వానికి భిన్నంగా పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆహ్వానిస్తున్నది. వైసీపీ హయాంలో ఔషధ తయారీ పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సాహించకపోగా అప్పటికే ఉన్న ఫార్మా కంపెనీలపై రకరకాల ఆంక్షలు విధించి వేధింపులకు గురి చేసింది. గత ఏడాది ఎన్నికల తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. ఔషధ తయారీ రంగం అభివృద్ధి, విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించింది. పరిశ్రమల ఏర్పాటుకు అడిగిందే తడవుగా ప్రభుత్వం తరపున తోడ్పాటు అందిస్తుండడంతో అనేక కంపెనీలు రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు ముందుకు వస్తున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే అనకాపల్లి జిల్లాలో రెండు (నక్కపల్లి, రాంబిల్లి) బల్క్ డ్రగ్ పార్కుల ఏర్పాటుకు ప్రముఖ ఔషధ తయారీ కంపెనీలు ముందుకు వచ్చాయి. ఇప్పటికే అచ్యుతాపురం, పరవాడ, రాంబిల్లి మండలాల్లో పదుల సంఖ్యలో ఫార్మా కంపెనీలు వున్నాయి. అయినప్పటికీ మరిన్ని కొత్త ఫార్మా కంపెనీల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నది.

రాంబిల్లి మండలంలో 'లారస్' బల్క్ డ్రగ్ పార్క్

రాంబిల్లి ఏపీఐఐసీ సెజ్‌లో 500 ఎకరాల్లో ప్రముఖ ఫార్మా కంపెనీ లారస్ ల్యాబ్స్ రూ.5 వేల కోట్లతో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు చేయనున్నది. ఈ మేరకు లారస్ ల్యాబ్స్ సీఈవో చావా సత్యనారాయణ, కంపెనీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ సీఎస్ రావు ఇటీవల అమరావతిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని కలిసి రాంబిల్లి మండలంలో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు కోసం భూమి కేటాయించాలని కోరారు. ప్రాజెక్టు ఏర్పాటుకు అవసరమైన డీపీఆర్‌ను సీఎంకు అందజేశారు. చంద్రబాబునాయుడు సానుకూలంగా స్పందించారు. లారస్ ల్యాబ్స్ అనకా పల్లి జిల్లాలో ఇప్పటికే పరవాడ ఫార్మా సిటీ, అచ్యుతా పురం సెజ్‌లో ఔషధ తయారీ కంపెనీలు వున్నాయి. రాంబిల్లి మండలంలో ఏర్పాటు చేయతలపెట్టిన బల్క్ డ్రగ్ పార్కు ద్వారా సుమారు 7,500 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

నక్కపల్లిలో 2,100 ఎకరాల్లో బల్క్ డ్రగ్ పార్క్

నక్కపల్లి మండలంలోని ఏపీఐఐసీ పారిశ్రామిక ప్రాంతంలో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుకు ప్రభుత్వం ఇప్పటికే 2,100 ఎకరాలు కేటాయించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది జనవరిలో ప్రధాని నరేంద్ర మోదీ విశాఖ నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఇక్కడ మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం సుమారు రూ.1,500 కోట్లు మంజూరు చేసింది. ప్రస్తుతం ఆయా పనులు జరుగుతున్నాయి. ఇవి పూర్తయిన తరువాత ఫార్మా కంపెనీల ఏర్పాటుకు ప్రభుత్వం భూములు కేటాయిస్తుంది. ఇక్కడ దేశవిదేశాలకు చెందిన పలు కంపెనీలు రూ.15 వేల కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు ఏర్పాటు చేయనున్నాయి. వీటిల్లో సుమారు 50 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అభిస్తాయి.

'పేట ఏఎంసీ చైర్మన్‌గా దేవర

- తెలుగుదేశం ఆవిర్భావం నుంచి పార్టీలోనే కొనసాగిన నేతగా గుర్తింపు
- విధేయతకు పట్టం కట్టిన అధిష్ఠానం


దేవర సత్యనారాయణ

నక్కపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మండలంలోని దేవవరం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు దేవర సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలోనే వుంటూ అధిష్ఠానానికి విధేయుడుగా వుంటున్న ఆయనకు చాలా కాలం తరువాత నామినేటెడ్ పదవి లభించింది. మండల వ్యవస్థ ఏర్పడిన తరువాత 1987లో ఎంపీపీ పదవికి తొలిసారి జరిగిన ప్రత్యక్ష ఎన్నికల్లో ఆయన నక్కపల్లి మండల పరిషత్ అధ్యక్షుడిగా ఎన్నియ్యారు. తరువాత 2013లో దేవవరం పంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికై గ్రామాభివృద్ధికి విశేష కృషి చేశారు. పార్టీ పరంగా తెలుగు యువత జిల్లా అధ్యక్షుడిగా, టీడీపీ జిల్లా కార్యదర్శిగా, టీడీపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. తెలుగుదేశం పార్టీకి నిబద్ధత గల నేతగా గుర్తింపు పొందారు. కామర్స్‌లో మాస్టర్స్ చేసిన సత్యనారాయణ జిల్లా గొర్రెల పెంపకందారుల సంక్షేమ సంఘం చైర్మన్‌గా సుమారు రెండు దశాబ్దాలపాటు సేవలు అందించారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి అయిన వంగలపూడి అనిత సిఫారసుతో యాదవ సామాజిక వర్గానికి చెందిన సత్యనారాయణను పాయకరావుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, హోం మంత్రి అనిత, పలువురు నేతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఏఎంసీ చైర్మన్‌గా తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నెరవేరుస్తానని సత్యనారాయణ చెప్పారు.

పంచాయతీల విద్యుత్ బకాయిలు రూ.121 కోట్లు

- ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులతో ఈపీడీసీఎల్ అధికారుల సమావేశాలు
- త్వరితగతిన చెల్లించాలని నోటీసులు
- నిధులు లేవంటూ చేతులెత్తేస్తున్న చిన్న పంచాయతీల కార్యదర్శులు


ఏఎల్ పురం పంచాయతీ వ్యూ

నర్సీపట్నం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో గ్రామ పంచాయతీల విద్యుత్ బిల్లుల బకాయిలు కొండలా పేరుకుపోయి. సుమారు రూ.121 కోట్లు పెండింగ్‌లో వున్నాయి. వీటిని త్వరగా చెల్లించాలంటూ ఏడీలు తమ పరిధిలోని మండలాల్లో ఎంపీడీవోలు, పంచాయతీల కార్యదర్శులతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. అయితే నిధుల లేమి కారణంగా బిల్లులు చెల్లించలేమని తక్కువ ఆదాయం వున్న చిన్న పంచాయతీల కార్యదర్శులు చేతులెత్తేస్తున్నారు.

జిల్లాలో 646 గ్రామ పంచాయతీలు వున్నాయి. దాదాపు అన్ని పంచాయతీల్లో తాగునీటి పథకాలు వున్నాయి. ఇంకా వీధి దీపాలు, కార్యాలయాలతోపాటు ఇతర అవసరాలకు వినియోగించిన విద్యుత్తుకు సంబంధించిన 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరి నెలాఖరు వరకు రూ.121.9 కోట్ల విద్యుత్ బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఎంపీడీవోలు, పంచాయతీల కార్యదర్శులతో ఈపీడీసీఎల్ సబ్ డివిజన్ అధికారులు సమావేశాలు ఏర్పాటు చేసి, వీలైనంత త్వరగా బకాయిలు చెల్లించాలని కోరుతున్నారు. ఇదే సమయంలో పంచాయతీ కార్యదర్శులకు డిమాండ్ నోటీసులు ఇస్తున్నారు. కాగా పంచాయతీల విద్యుత్ బిల్లులకంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయదు. పంచాయతీల సాధారణ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి విద్యుత్ బిల్లులు చెల్లించాలి. కానీ జిల్లాలో అత్యధిక పంచాయతీకు సాధారణ నిధులు (ఇళ్ల పన్నులు, వగైరా) చాలా తక్కువ వుంటున్నాయి. ఇవి పారిశుధ్య పనులకు, నీటి పథకాల నిర్వహణ పనులకే చాలడంలేదు. దీంతో విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించలేని పరిస్థితి ఏర్పడుతున్నది. కానీ ఆర్థిక సంఘం నిధులతో విద్యుత్ బిల్లులు చెల్లించే అవకాశం వున్నప్పటికీ బకాయిలు కట్టడంలేదని ఈపీడీసీఎల్ అధికారులు అంటున్నారు.

జిల్లాలో ఈపీడీసీఎల్‌కి సంబంధించి అనకాపల్లి, కశింకోట, నర్సీపట్నం డివిజన్‌లు ఉన్నాయి. అనకాపల్లిలో 4, కశింకోటలో 5, నర్సీపట్నంలో 4 చొప్పున మొత్తం 13 సబ్ డివిజనల్‌లు ఉన్నాయి. నర్సీపట్నం డీఈఈ పరిధిలో నాతవరం, చోడవరం, మాడుగుల, నర్సీపట్నం సబ్ డివిజన్‌లు ఉన్నాయి. నర్సీపట్నం ఈఈఈ పరిధిలోని మండలాల్లో వున్న పంచాయతీల నుంచి

... మిగతా 8వ పేజీలో

డంపర్ లారీ ఢీకొని ఫార్మా ఉద్యోగి మృతి

అచ్యుతాపురం జంక్షన్‌లో ఘటన


బగాది రమణారావు (ఫైల్ ఫొటో)

అచ్యుతాపురం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి):

స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్‌లో శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఫార్మా కంపెనీ ఉద్యోగి మృతి చెందాడు. ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి కంపెనీకి వెళుతుండగా అచ్యుతాపురం కూడలిలో ఎలమంచిలి వైపు నుంచి వస్తున్న భారీ డంపర్ లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఇందుకు సంబంధించి వివరాలిలా వున్నాయి.

విజయనగరం జిల్లా సంతకవిటి మండలం గెద్దవలస నరసింహపురం (జీఎన్ పురం) గ్రామానికి చెందిన బగాది రమణారావు (40) పరవాడలో ఫార్మా సిటీలోని ఒక ఫార్మా కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి అచ్యుతాపురం మండలం మోసయ్యపేటలోని బర్మాకాలనీలో నివాసం వుంటున్నాడు. రోజూ బైక్‌పై కంపెనీకి వెళ్లి వస్తుంటాడు. శుక్రవారం మొదటి షిఫ్ట్ విధులకు హాజరు కావడానికి ఉదయం 5.30 గంటల సమయంలో బైక్‌పై బయలుదేరాడు. దారిలో అచ్యుతా పురం జంక్షన్ వద్ద కుడివైపునకు తిరుగుతుండగా, ఇదే సమయంలో రాంబిల్లి మండలంలోని ఎన్ఏఓబీలో బండరాళ్లను అన్‌లోడ్ చేసి వస్తున్న డంపర్ లారీ, బైక్‌ను ఢీకొన్నది. దీంతో రమణారావు కిందపడిపోయాడు. అక్కడ వున్న వారు పెద్దగా కేకలు వేయడంతో డ్రైవర్ డంపర్ లారీని రివర్స్ చేశాడు. ఈ క్రమంలో రమణారావు తల మీద నుంచి ముందు టైరు వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా కారణంగానే ప్రమాదం జరిగిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న సీఐ నమ్మి గణేశ్, పోలీసు సిబ్బందితో వచ్చి పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

నర్సు పోస్టులకు ఫేక్ సర్టిఫికెట్లు!


వైద్య, ఆరోగ్య శాఖ ఆర్‌డీ కార్యాలయం (ఫైల్ ఫొటో)

వైద్య, ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయ పరిధిలో 370 ఖాళీల భర్తీకి మూడు నెలల కిందట నోటిఫికేషన్

- 8,300 మంది దరఖాస్తు
- కొవిడ్ సమయంలో పని చేయకుండానే చేసినట్టు సర్టిఫికెట్లు జత చేసిన పలువురు అభ్యర్థులు
- గుర్తించిన అధికారులు
- కేజీహెచ్, ఆంధ్ర మెడికల్ కళాశాల, శ్రీకాకుళంలోని జనరల్ ఆస్పత్రి పేర్లతో జారీ
- తుది దశకు ఎంపిక ప్రక్రియ... దళారుల రంగ ప్రవేశం
- అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న ఆర్డీ డాక్టర్ రాధారాణి

విశాఖపట్నం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి):

వైద్య, ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయ పరిధిలో స్టాఫ్ నర్సు పోస్టులను భర్తీ చేయాలని భావించిన అధికారులకు ఫేక్ సర్టిఫికెట్ల వ్యవహారం తొలనొప్పిగా మారింది. తాము కొవిడ్ సమయంలో పనిచేసినట్టు కొందరు ఫేక్ సర్టిఫికెట్లను సమర్పించారు. వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ధారించుకోవాల్సి రావడంతో నియామక ప్రక్రియ ఆలస్యం అవుతోంది.

ఆర్డీ కార్యాలయ పరిధిలోని ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో 106 స్టాఫ్ నర్సు పోస్టులు భర్తీ చేసేందుకు అధికారులు నోటిఫికేషన్ జారీచేయగా, సుమారు 8,300 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆ తరువాత మరికొన్ని ఖాళీలను గుర్తించారు. దాంతో పోస్టుల సంఖ్య 370కు చేరింది. భారీగా వచ్చిన దరఖాస్తులను వడపోసిన అధికారులు కొందరు ఫేక్ సర్టిఫికెట్లు (కరోనా సమయంలో పని చేయకుండానే చేసినట్టు) జత చేసినట్టు గుర్తించారు. ఆయా సర్టిఫికెట్లను మెడికల్ కళాశాలలు, ఆస్పత్రులకు పంపించి పునఃపరిశీలన చేయించారు. ఇప్పటివరకూ 14 మంది జత చేసినవి ఫేక్ కొవిడ్ సర్టిఫికెట్లుగా అధికారులు నిర్ధారించారు. మరికొన్ని నిర్ధారణ కావాల్సి ఉందని చెబుతున్నారు. కాగా, ఇప్పటికే గుర్తించిన 14 ఫేక్ సర్టిఫికెట్లు కేజీహెచ్, ఆంధ్ర మెడికల్ కాలేజీ, శ్రీకాకుళంలోని జనరల్ ఆస్పత్రి నుంచి తెచ్చినట్టుగా అధికారులు నిర్ధారించారు. ఈ సర్టిఫికెట్లు అందించేందుకు అక్కడి సిబ్బంది డబ్బులు వసూలు చేసినట్టు చెబుతున్నారు. ఆరోగ్య శాఖలో చేపట్టే నియామకాల్లో కొవిడ్‌లో పనిచేసిన వారికి కొంత వెయిటేజీ ఇస్తున్నారు. దీంతో ఆ సర్టిఫికెట్‌కు డిమాండ్ పెరిగింది. దానిని కొందరు క్యాష్ చేసుకుంటున్నారు. ఈ సర్టిఫికెట్‌లను కొందరు అభ్యర్థులకు కేజీహెచ్‌లోని నర్సింగ్ అసోసియేషన్‌లో కీలకంగా పనిచేసే వ్యక్తి ఇస్తున్నట్టు చెబుతున్నారు. దీనిపై కేజీహెచ్, మెడికల్ కాలేజీ అధికారులు విచారణ చేయాలని, అప్పుడే ఈ తరహా నకిలీ సర్టిఫికెట్లకు చెక్ చెప్పేందుకు అవకాశం ఉంటుందని కోరుతున్నారు.

రెండు రోజుల్లో మెరిట్ లిస్ట్

రెండు రోజుల్లో ఫైనల్ మెరిట్ లిస్టు విడుదల చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే మొత్తం

... మిగతా 8వ పేజీలో

రోడ్డు పనుల్లో నాణ్యతా లోపం


సైతారుపేట రోడ్డు జంక్షన్ వద్ద ప్యాచ్‌వర్క్ లేచిపోవడంతో బయటపడిన గొయ్యి

- ఎలమంచిలి బైపాస్ రోడ్డులో ఆరు వారాలకే దెబ్బతిన్న ప్యాచ్ వర్క్
- లేచిపోయిన రాళ్లు.. బయటపడిన గోతులు

ఎలమంచిలి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి):


పెట్రోలు బంకు సమీపంలో గొయ్యి ఏర్పడి లేచిపోయిన రాళ్లు

పట్టణంలోని బైపాస్ రోడ్డు మరమ్మతు పనులపై అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో కొద్ది రోజులకే నాణ్యతా లోపాలు బయటపడుతున్నాయి. గోతులను మెటల్‌తో పూడ్చి, పైన తారు వేశారు. అయితే ఆరు వారాల్లోనే రాళ్లు లేచిపోయి గోతులు యథావిధిగా దర్శనమిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అన్ని రహదారుల మాదిరిగానే ఎలమంచిలి బైపాస్ రోడ్డు కూడా కనీస నిర్వహణ పనులకు నోచుకోక

... మిగతా 8వ పేజీలో

ఆర్టీసీ బస్సు బోల్తా

- తప్పిన పెనుప్రమాదం
- హైవే పైనుంచి పంట పొలాల్లోకి దూసుకువెళ్లిన వైనం
- ఆరుగురికి తీవ్ర గాయాలు
- ద్విచక్ర వాహనాన్ని తప్పించే క్రమంలో ప్రమాదం

ఎలమంచిలి మండలం పురుషోత్తపురం జంక్షన్ సమీపంలో శుక్రవారం సాయంత్రం ఓ ఆర్టీసీ బస్సు అదుపుతప్పి జాతీయ రహదారి పైనుంచి పక్కనున్న పొలాల్లోకి దూసుకుపోయి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆరుగురికి తీవ్ర గాయాలు కాగా, మరికొంతమందికి స్వల్ప గాయాలయ్యాయి.

.... వివరాలు మెయిన్‌లో


జాతీయ రహదారి పైనుంచి దూసుకువెళ్లి పొలాల్లో బోల్తాపడిన బస్సు


క్షతగాత్రులను అంబులెన్స్‌లో అనకాపల్లి తరలిస్తున్న దృశ్యం

చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం నోటీసుకు సంబంధించి

22న ప్రత్యేక సమావేశం

- ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా నర్సీపట్నం ఆర్డీవో హాజరు
- కౌన్సిలర్లకు సమాచారం పంపిన మునిసిపల్ కమిషనర్



ఎలమంచిలి మునిసిపల్ కార్యాలయం

ఎలమంచిలి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి మునిసిపల్ చైర్‌పర్సన్ రమా కుమారిపై గత నెల 26వ తేదీన 19 మంది కౌన్సిలర్లు ఇచ్చిన అవిశ్వాస తీర్మానం నోటీసుపై ఈ నెల 22న ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్టు మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఈ మేరకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారన్నారు. నర్సీపట్నం ఆర్డీవో రమణ ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారన్నారు. ఆయన సమక్షంలోనే కౌన్సిలర్లంతా హాజరు కానున్నారన్నారు. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని కౌన్సిలర్లందరికీ తెలియజేసినట్టు కమిషనర్ వివరించారు.

13న తలుపులమ్మ ఆలయం ప్రారంభం



ఆలయ ప్రారంభోత్సవ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

ఎలమంచిలి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : షేకిళ్లపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన తలుపులమ్మ ఆలయం ఈ నెల 13వ తేదీన ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు టి.వరహాలరావు మాట్లాడుతూ అమ్మవారి ఆలయాన్ని గ్రామస్థులతో పాటు పలువురు భక్తుల సహాయ సహకారంతో నిర్మించినట్టు చెప్పారు. ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే హాజరు కానున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జి.సత్తిబాబు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

14న చోడపల్లిలో చోడమాంబిక జాతర



అచ్యుతాపురం రూరల్, ఏప్రిల్ 4, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చోడపల్లిలో కొలువుదీరిన ఏడు గ్రామాల ఆరాధ్య దేవత చోడమాంబిక అమ్మవారి జాతరకు విస్తృతంగా ఏర్పాట్లు చేపడుతున్నట్టు కమిటీ ఛైర్మన్ వడిసల సన్యాసిరావు తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల ఏడో తేదీన పుట్టుక మహోత్సవం, 14న జాతర జరుగుతుందన్నారు. ఆ రోజు వేకువజాము నుంచి అమ్మవారికి విశేష పూజలు నిర్వహిస్తామన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు.

నిర్వాసితుల ఆమోదం లేకుండా భూములు తీసుకోం

- అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డు విస్తరణ బాధితులతో చోడపల్లి సచివాలయంలో ఆర్డీవో సమావేశం
- టీడీఆర్ బాండ్లపై అవగాహన
- నగదు రూపంలోనే తమకు నష్టపరిహారం చెల్లించాలని ముక్తకంఠంతో అంతా పట్టు



టీడీఆర్ బాండ్లపై నిర్వాసితులకు అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో ఆయిషా

అచ్యుతాపురం రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు విస్తరణలో నష్టపోతున్న తమకు టీడీఆర్ బాండ్లు వద్దని, నగదు రూపంలో నష్టపరిహారాన్ని అందజేయాలని నిర్వాసితులు స్పష్టం చేశారు. మండలంలోని చోడపల్లి సచివాలయంలో అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డు విస్తరణ నిర్వాసితులతో శుక్రవారం అనకాపల్లి ఆర్డీవో షేక్ ఆయిషా టీడీఆర్ బాండ్లపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిర్వాసితుల ఆమోదం లేకుండా బలవంతంగా భూములను తీసుకోడానికి తాము రాలేదన్నారు. కేవలం టీడీఆర్ బాండ్ల వలన కలిగే ప్రయోజనాలను వివరించేందుకు మాత్రమే ఇక్కడికి విచ్చేసినట్టు చెప్పారు. నష్టపరిహారం నగదు రూపంలో కాకుండా బాండ్ల రూపంలో ఇచ్చే వీలుందన్నారు. 2018 నుంచి రాష్ట్రంలోని ఏ ప్రాంతంలో నైనా ఈ టీడీఆర్ బాండ్లు అమ్ముకునే వీలుండేలా ప్రభుత్వం నిర్వాసితులకు అందజేస్తున్నట్టు చెప్పారు. నష్టపరిహారం డబ్బుల రూపంలో తెలియజేయ కుండా, ఎంత మేర స్థలం పోతుందో, ఆ స్థలం వైశాల్యాన్ని మాత్రమే బాండు మీద రాస్తామని ఆర్డీవో స్పష్టం చేశారు. నిర్వాసితులు మాట్లాడుతూ రోడ్డు విస్తరణకు తాము వ్యతిరేకం కాదన్నారు. నష్టపరిహారం టీడీఆర్ బాండ్ల రూపంలో కాకుండా తమకు నేరుగా నగదు రూపంలో అందజేయాలని పునరుద్ఘాటించారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా గజానికి రూ.14,500 నుంచి రూ.16,500 వరకూ నష్టపరిహారం అందజేయాలని కోరారు. కొన్ని పంచాయతీలలో గజానికి రూ.25 వేలు కూడా నష్టపరిహారం ప్రకటించారన్నారు. నష్టపరిహారంతో పాటుగా నిర్వాసితులకు పునరావాసం కూడా కల్పించాలని డిమాండ్ చేశారు. టీడీఆర్ ప్రతిపాదన విరమించుకుని, తమకు పూర్తి న్యాయం చేయాలని కోరుతూ వారంతా సమావేశం నుంచి బయటకు వచ్చేశారు. అనంతరం నిర్వాసితుల సమస్యలను ఆర్డీవోకు నిర్వాసిత నాయకులు వినతి పత్రం రూపంలో అందజేశారు. డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్, మాజీ ఎంపీపీ వడిశల శ్రీనివాసరావు, ఎంపీటీసీ లాలం శ్రీను, గ్రామ నాయకులు గండిబోయిన వెంకట్, నిర్వాసితుల సంఘం కన్వీనర్ రొంగలి రాము, ఎస్.బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.



నిర్వాసితుల డిమాండ్లపై ఆర్డీవోకు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

గొరపూడి పంచాయతీ భూములు 'బల్క్‌డ్రగ్'కు ఇచ్చేది లేదు

- గ్రామ నాయకులు, రైతులు స్పష్టీకరణ



సమావేశంలో పాల్గొన్న గొరపూడి పంచాయతీ నాయకులు

రాంబిల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమల ఏర్పాటుకు తమ జీవనాధారమైన పంట భూములను ఏపీఐఐసీకి ఇచ్చేది లేదని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి లాలం తాతబాబు, గ్రామ నాయకులు, రైతులు స్పష్టం చేశారు. మండలంలోని అప్పన్నపాలెంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గొరపూడి పంచాయతీలో బల్క్‌డ్రగ్ పరిశ్రమ ఏర్పాటుకు లారెస్ సంస్థ ముందుకు వచ్చిందని, లారస్ ల్యాబ్స్ కోసం భూమిని కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ప్రచారంలో జరుగుతుండడంతో తమలో ఆందోళన మొదలైందన్నారు. గొరపూడి పంచాయతీలో సెంటు భూమి కూడా ఇప్పటి వరకు పరిశ్రమల ఏర్పాటుకు ఏపీఐఐసీకి ఇవ్వలేదన్నారు. పలుమార్లు అధికారులు రైతులతో సమావేశమైనప్పుడు కూడా పరిశ్రమలకు భూములు ఇచ్చేది లేదని స్పష్టం చేశారన్నారు. రైతులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా భూములను బల్క్‌డ్రగ్ పరిశ్రమ ఏర్పాటుకు లారెస్ సంస్థకు ఎలా ఇస్తారని ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను వారు ప్రశ్నించారు. గొరపూడి పంచాయతీలో భూములను పరిశ్రమలకు ఇచ్చేది లేదని, అవసరమైతే తమ భూములను కాపాడుకోవడానికి ప్రాణాలైన అర్పిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో గ్రామ పెద్దలు గొర్లె నర్సింగరావు, నెక్కల నర్సింగరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కొత్తపేటలో రామాలయం ప్రారంభం

రాంబిల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపేటలో నూతనంగా నిర్మించిన రామాలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ సీతారాములు, లక్ష్మణ విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. గ్రామ పెద్దలు, కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

రాంబిల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారిణి విజేత, ఏవో సి.సుమంత అన్నారు. మూలజంపలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శుక్రవారం ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. రసాయనాలు లేకుండా పండించిన పంటల ద్వారా ప్రజలు ఆరోగ్యంగా ఉండడంతో పాటు భూమి సారవంతంగా ఉంటుందన్నారు. సర్పంచ్ అచ్చియ్యనాయుడు, ఎంపీటీసీ నాగేశ్వరరావు, టీడీపీ నాయకుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాల బస్సుకు త్రుటిలో తప్పిన ప్రమాదం

- దోసూరు మలుపు వద్ద అదుపు తప్పి, పక్కకు ఒరిగిన వాహనం
- సురక్షితంగా బయటపడిన విద్యార్థులు



పక్కకు ఒరిగిపోయిన కళాశాల బస్సు

అచ్యుతాపురం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఓ కళాశాలకు చెందిన బస్సు అదుపు తప్పి, పక్కకు ఒరిగిపోవడంతో అందులో ఉన్న విద్యార్థులంతా ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. అచ్యుతాపురం నుంచి మడుతూరు జంక్షన్, మడుతూరు, దోసూరు, రాజానపాలెం, పరవాడ మీదుగా ఓ ప్రైవేటు కళాశాలకు చెందిన బస్సు ప్రతి రోజు విద్యార్థులను తీసుకు వెళ్లేందుకు వస్తుంది. అదేవిధంగా శుక్రవారం రావడంతో విద్యార్థులంతా ఎక్కారు. దోసూరు వద్ద గల మలుపు వద్దకు వచ్చే సరికి డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా బస్సు రోడ్డు పక్కనున్న గోతిలోకి వాలిపోయింది. దీంతో అందులోని విద్యార్థులు ఒక్కసారిగా ఆందోళనకు లోనయ్యారు. గొయ్యి పెద్దది కావడంతో బస్సు పల్టీ కొట్టలేదు. దీంతో అంతా సురక్షితంగా బయటకు వచ్చారు. అనంతరం తాళ్ల సహాయంతో బస్సును బయటకు లాగారు.

యాదవ కార్పొరేషన్ డైరెక్టర్

రంగనాయకులుకు సత్కారం



రంగనాయకులును సత్కరిస్తున్న పప్పల చలపతిరావు

ఎలమంచిలి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఇటీవల ప్రమాణం చేసిన ధూళి రంగనాయకులును శుక్రవారం ఇక్కడి టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, స్థానిక నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రంగనాయకులు మాట్లాడుతూ పార్టీకి తాను అందించిన సేవలకు గుర్తింపుగా అధిష్ఠానం కట్టబెట్టిన ఈ పదవికి న్యాయం చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ, జిల్లా ప్రతినిధి రాజాన సూర్యనాగేశ్వరరావు, బొద్దపు శ్రీనివాసరావు, కరణం రవికుమార్, నమ్మి రమణ, వీసం కోటి, గుర్రాల రాము, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.


జీవనోపాధి ప్రణాళికపై శిక్షణ



మండల సమాఖ్య కార్యాలయంలో మాట్లాడుతున్న ఏపీఎం శివప్రసాద్

ఎస్.రాయవరం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండల సమాఖ్య కార్యాలయంలో వెలుగు ఏపీఎం జి.శివప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం వెలుగు సిబ్బంది, వీవోఏలకు శుక్రవారం రెండో రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ 2025-26 సంవత్సరానికి స్వయం సహాయక సంఘాల మహిళలకు జీవనోపాధికి సంబంధించిన ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ఇందుకోసం ఎన్యూమరేటర్లు, వీవోఏలకు వీడియో రూపంలో శిక్షణ ఇవ్వడం జరిగిందని చెప్పారు. అలాగే సీడప్ ఉన్నతి ఎంజీఎన్ఆర్ఈజీఎస్‌లో 18 నుంచి 35 ఏళ్ల వయసు గల వారిని సీడప్‌లో నమోదు చేసుకోవడానికి సంబంధించి వారికి సలహాలు, సూచనలు అందిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్యూమరేటర్లు, వీవోఏలు, వెలుగు సీసీలు పాల్గొన్నారు.


గూడుపమ్మను దర్శించుకున్న ప్రేమసాయి



ప్రేమసాయిని సత్కరిస్తున్న ఆలయ ధర్మకర్త శ్రీహరిరాజు

నక్కపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేబాక గూడుపమ్మ తల్లి శక్తి పీఠాన్ని శుక్రవారం విజయనగరం జిల్లా తాటిపూడి (సాయివారి పల్లె) దివ్య అమృతాశ్రమం పీఠాధిపతి ప్రేమసాయి దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త గొట్టుముక్కల శ్రీహరి రాజు తదితరులు ఆయనకు స్వాగతం పలికారు. నవదుర్గ సహిత అష్టాదశ శక్తిపీఠాల దేవతామూర్తులతో కూడిన గూడుపమ్మను ఆయన దర్శించుకుని పూజలు చేశారు. అమ్మవారి చరిత్రను ఆలయ ధర్మకర్త శ్రీహరిరాజు ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ప్రేమసాయి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ సత్యాన్ని నమ్ముకోవాలన్నారు. ఈ సందర్భంగా అమ్మవారి శేషవస్త్రం, చిత్రపటాన్ని శ్రీహరిరాజు ఆయనకు అందజేశారు.

తిమ్మాపురంలో పశువుల తొట్టెకు భూమి పూజ



పశువుల తొట్టెకు భూమి పూజ చేస్తున్న దృశ్యం

ఎస్. రాయవరం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేజర్ పంచాయతీ తిమ్మాపురం శ్మశాన వాటిక వద్ద పశువులు సంచరించే ప్రదేశంలో రూ.45 వేల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో పశువుల తొట్టె నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. గ్రామ సర్పంచ్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ, ఎన్ఆర్ఈజీఎస్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్ పి.సంధ్యకుమారి ఈ కార్యక్రమం చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ పశువుల తొట్టె వల్ల గ్రామంలోని పశువులకు ఎంతో మేలు చేకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌పీ లోవతల్లి, రైతులు పాల్గొన్నారు.

రాయితీ రుణాల మంజూరుకు ఇంటర్వ్యూలు



సబ్సిడీ రుణాల కోసం అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

పాయకరావుపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వివిధ కార్పొరేషన్ల ద్వారా రాయితీ రుణాల మంజూరుకు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయడానికి అభ్యర్థులకు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఇంటర్వ్యూల్లో ఎంపీడీవో ఎ.జయప్రకాశరావు ఆధ్వర్యంలో వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ బీసీ, ఈబీసీ, బ్రాహ్మిన్, కాపు, క్షత్రియ, రెడ్డి, వైశ్య కార్పొరేషన్ల ద్వారా ప్రభుత్వం పాయకరావుపేట మండలానికి మొత్తం 101 యూనిట్లు మంజూరు చేసిందని చెప్పారు. వీటి కోసం మండలంలో మొత్తం 2,150 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. రుణాలకు అర్హులైన లబ్ధిదారుల ఎంపిక కోసం మొదటి రోజు శుక్రవారం నిర్వహించి ఇంటర్వ్యూలో ఎస్‌బీఐ, ఐఓబీ, ఏపీజీవీబీ బ్యాంకులకు చెందిన అధికారులు పాల్గొని సుమారు 200 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించారన్నారు. మిగిలిన అభ్యర్థులకు సోమ, మంగళవారాల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపీడీవో తెలిపారు.

బాల సంజీవిని 2.0పై అంగన్‌వాడీల నిరసన



సెల్ ఫోన్లు చూపుతూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో వినియోగిస్తున్న బాల సంజీవిని 2.0 కొత్త వెర్షన్‌తో చిక్కులు తలెత్తి అధిక పని భారంతో మానసిక ఒత్తిడికి లోనవుతున్నామని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం నామవరంలో నిర్వహించిన కార్యక్రమంలో మంగవరం క్లస్టర్ అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన తెలిపారు. ఇప్పటికే పాత ఫోన్లలో సాంకేతిక సమస్య కారణంగా సిగ్నల్స్ లేకపోవడం, ఫొటో కాప్చర్ అవక సరుకుల పంపిణీలో తీవ్ర జాప్యం జరుగుతున్నదని చెప్పారు. ఇపుడు బాల సంజీవిని 2.0తో మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొత్త వెర్షన్‌ను సవరించాలని డిమాండ్ చేశారు. అలాగే అంగన్‌వాడీ కార్యకర్తలకు పెన్షన్ల డ్యూటీ నుంచి విముక్తి కలిగించాలని, కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, కొత్తగా 5జి ట్యాబ్‌లను అందజేసి పనిభారం తగ్గించాలని వారు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం సభ్యులు గుమ్మడి ఊర్మిళ, నాగమణి, పి.శ్యామల, అన్నపూర్ణ, నాగిని, తులసి తదితరులు పాల్గొన్నారు.

350 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న నల్ల బెల్లం, అమోనియా

పాయకరావుపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసులు శుక్రవరం పట్టణ శివారులో విస్తృత దాడులు నిర్వహించి నాటు సారా తయారీ కోసం నిల్ల ఉంచిన సుమారు 350 లీటర్ల బెల్లం పులుపును గుర్తించి ధ్వంసం చేశారు. అలాగే ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 15 కేజీల నల్ల బెల్లం, మూడు కిలోల అమోనియా స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాసు మాట్లాడుతూ పట్టణంలో అంబేడ్కర్ కాలనీ, దుర్గాకాలనీ తదితర ప్రాంతాల్లో సిబ్బందితో దాడులు నిర్వహించినట్టు చెప్పారు. ఈ దాడుల్లో ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారని, వారిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. వారి నుంచి 15 కేజీల నల్ల బెల్లం, మూడు కిలో అమోనియా స్వాధీనం చేసుకోవడంతో పాటు నాటు సారా తయారీ కోసం నిల్వ ఉంచిన సుమారు 350 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేశామన్నారు. కేసు నమోదుచేసి నిందితులను రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు. ఈ దాడుల్లో సిబ్బంది బి.రమణ, నాగశంకరరావు, జగన్నాథ్ పాల్గొన్నారని ఎక్సైజ్ సీఐ తెలిపారు.

అకాల వర్షం.. సేదదీరిన జనం

దేవరాపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఎండ ప్రచండంతో అల్లాడుతున్న మండల ప్రజలు వరుణుడు కరుణతో సేదదీరారు. వాతావరణం ఒక్కసారిగా చల్లబడిపోవడంతో ఉపశమనం పొందారు. గత మూడు రోజులుకు బయటకు వెళ్లలేని ప్రజలకు శుక్రవారం సాయంత్రం ఉరుములుచ మెరుపులతో కూడిన వర్షం ఉపశమనం కల్పించింది. ఒక్క సారిగా వాతావరణం చల్ల బడడంతో జనం ఊపిరి పీల్చుకున్నారు. ఈ వర్షం పశుగ్రాసం, కూరకాయల పంటలకు ఉపయోగ పడుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



దేవరాపల్లి ప్రధాన రహదారిపై కురుస్తున్న వర్షం

బాలల హక్కులను కాపాడాలి

బాలల పరిరక్షణ కమిటీ ప్రతినిధి లోవరాజు

నక్కపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కులను కాపాడేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని జిల్లా బాలల పరిరక్షణ కమిటీ ప్రతినిధి డి.లోవరాజు చెప్పారు. నక్కపల్లి, డొంకాడ సచివాలయల్లో బాలల హక్కులు, బాల్య వివాహాల నిర్మూలనపై సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలకు, ఇతర సిబ్బందికి శుక్రవారం అవగాహన కల్పించారు. బాలికలను ఉన్నతంగా చదివించాలని సూచించారు. బాల్య వివాహాలు చేయడం వల్ల తక్కువ వయసులోనే పిల్లలు అనారోగ్యానికి గురవుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు జయరత్నకుమారి, కొండలరావు, ఉప సర్పంచ్ వీసం రాజు పాల్గొన్నారు.

నిర్వాసితులందరికీ పరిహారం ఇవ్వాలని ఆర్డీవోకు వినతి



ఆర్డీవో రమణకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

నక్కపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వీసీఐఆర్‌కు భూములు ఇచ్చిన నిర్వాసిత రైతులందరికీ 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం, ప్యాకేజీ ఇవ్వాలని నిర్వాసిత రైతులు కోరారు. మండలంలోని మూలపర్ర గ్రామంలో కారిడార్ నిర్వాసిత రైతులతో ఆర్డీవో వీవీవీ రమణ శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. నిర్వాసిత రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఒక్కొక్కరికీ రూ.25 లక్షలు ప్యాకేజీ, 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, గ్రామ పెద్దలు సూరకాసుల గోవింద్, గంటా నరసింగరావు తదితరులు డిమాండ్ చేశారు. నిర్వాసితులుగా గుర్తించిన వారికి పరిహారం, పునరావాసం తదితర అంశాల గురించి ఆర్డీవో రమణ వివరించారు. మిగిలిన విషయాలను తాను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, నిర్వాసిత రైతుల సమస్యలు పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉందని చెప్పారు. అనంతరం ఆర్డీవోకు నిర్వాసిత రైతులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.రాజేశ్, గోవింద్, వై.అప్పలరాజు, ఆర్.అప్పారావు పాల్గొన్నారు.

ఉప్పరాపల్లిలో చలివేంద్రం

ఎస్. రాయవరం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరాపల్లి గ్రామంలో పైడితల్లి అమ్మవారి హుండీ వద్ద శుక్రవారం చలి వేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ సేనాపతి శ్రీరాములు చేతుల మీదగా తాగునీటి అందించి చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిని పురస్కరించుకొని మండుతున్న ఎండలకు ఎవరూ తాగునీటి కోసం ఇబ్బందులకు గురికాకుండా చలివేంద్రం ప్రారంభించడం ఆనందకరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కేవీ.శ్రీనివాస్, గ్రామస్థులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై పాఠశాలల్లో అవగాహన సదస్సులు



యాప్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ మణికుమారి

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు విద్యా సంస్థలు, వసతి గృహాల్లో పోలీస్‌శాఖ శుక్రవారం శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమాలను నిర్వహించింది. రూరల్ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ మణి కుమారి, కానిస్టేబుల్ పుష్పలత బాలికోన్నత పాఠశాల, గుండాల జంక్షన్‌లోని బాలికల వసతి గృహం విద్యార్థినీ, విద్యార్థులకు ఈ యాప్ ప్రాముఖ్యత, ఈవ్‌టీజింగ్, ఫోక్సో చట్టం, బాల్య వివాహాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ అంశాలపై వివరించారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా 112, 1098 టోల్‌ఫ్రీ నంబర్లకు కాల్ చేయాలని ఏఎస్ఐ మణికుమారి సూచించారు.

వేతనాల కోసం ఉపాధి కూలీల ఆందోళన



పరవాడలో ఆందోళన చేపడుతున్న ఉపాధి కూలీలు

పరవాడ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఉపాధి హామీ పథకం కూలీలు శుక్రవారం పరవాడలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కూలీల బకాయి వేతనాలను తక్షణమే చెల్లించాలని, ఏడాదికి రెండు వందల రోజుల పనిదినాలు కల్పించాలని, రోజుకు రూ.600 వేతనం చెల్లించాలని, పే స్లిప్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే, సమ్మర్ అలవెన్సులు అధికంగా చెల్లించాలని, కూలీలకు పనిముట్లు ఉచితంగా అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు రామలక్ష్మి, పార్వతి, ఆదిలక్ష్మి, అప్పారావు, అప్పలనాయుడు, అప్పల నర్సమ్మ, లక్ష్మి, చెల్లయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

'11న కలెక్టరేట్ల వద్ద బీసీ సమరభేరి'



బీసీ సమరభేరి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాణిక్యాలరావు తదితరులు

కొత్తూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్ వద్ద ఈ నెల 11న నిర్వహించనున్న బీసీ సమరభేరిని విజయవంతం చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సూదికొండ మాణిక్యాలరావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఇక్కడ ఆవిష్కరించి మాట్లాడారు. బీసీ వర్గాల ప్రజల రాజకీయ, సామాజిక, ఆర్థికాభివృద్ధి సాధనకు బీసీ కుల జనగణన జరిపి తీరాలని కోరారు. ఇదే డిమాండ్‌తో అన్ని కలెక్టరేట్‌ల వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సాధన సమితి కన్వీనర్ కోన లక్ష్మణ, ప్రజా సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు బొడ్డేడ అప్పారావు, బొట్టా చిన్నియాదవ్, బీసీ సంఘాల జిల్లా నాయకుడు వాయిబోయిన శేఖర్, సంఘ నేతలు గోవింద, పోతురాజు, బాలరాజు, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

11 మందితో బాలల రక్షణ సంక్షేమ కమిటీ ఏర్పాటు



కమిటీ సభ్యులతో సమావేశమైన జిల్లా పిల్లల సంరక్షణ అధికారి రమేశ్

కొత్తూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : బాలల హక్కుల పరిరక్షణకు పదకొండు మంది సభ్యులతో బాలల రక్షణ, సంక్షేమ కమిటీని ఏర్పాటు చేసినట్టు అనకాపల్లి జిల్లా పిల్లల సంరక్షణ అధికారి రమేష్ తెలిపారు. అనకాపల్లి పట్టణంలోని గొల్లవీధిలో గల సచివాలయంలో శుక్రవారం ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. బాల్య వివాహ నిరోధక చట్టం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన తదితర అంశాలపై కమిటీ సభ్యులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు, వీఆర్‌వోలు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

థాంగ్- టా పోటీలకు బాలభారతి విద్యార్థి ఎంపిక



ఎంపికైన విద్యార్థి అశ్విన్ అనీస్‌తో ప్రిన్సిపాల్ వసంతదేవి

పరవాడ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : మణిపూర్‌లో ఈ నెలలో నిర్వహించనున్న జాతీయస్థాయి థాంగ్ - టా పోటీలకు సింహాద్రి ఎన్టీపీసీకి చెందిన బాలభారతి పబ్లిక్ స్కూల్ విద్యార్థి అశ్విన్ అనీస్ ఎంపికైనట్టు స్కూల్ పీఈటీ షెల్టన్ జేమ్స్ తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పాడేరులో నిర్వహించిన ఆంధ్ర ప్రదేశ్ థాంగ్ - టా టోర్నమెంట్‌లో అశ్విన్ అనీస్ స్వర్ణ పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్టు చెప్పారు. ఈ సందర్భంగా సదరు విద్యార్థిని ప్రిన్సిపాల్ వసంతదేవి తదితరులు శుక్రవారం అభినందించారు.

చెత్త కదలదు.. మురుగు వదలదు..



తేగాడ వెళ్లే ప్రధాన రోడ్డుపక్కన పేరుకుపోయిన చెత్త

▸▸ బయ్యవరం గ్రామంలో సమస్యలు తిష్ఠ ▸▸ పట్టించుకోని పంచాయతీ అధికారులు ▸▸ అవస్థలు పడుతున్న గ్రామస్థులు



చెత్తాచెదారం పేరుకుపోయిన చోట లీకవుతున్న పైపులైన్

కశింకోట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బయ్యవరంలో సమస్యలు తిష్ఠ వేశాయి. ప్రధానంగా పారిశుధ్యం, మురుగు, తాగునీరు వంటి సమస్యలు గ్రామస్థులను వెంటాడుతున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడం మరిన్ని సమస్యలకు కారణమవుతోంది. ఇక్కడ ఎప్పటికప్పుడు చెత్తను తరలించాల్సిన పారిశుధ్య సిబ్బంది ఆ దిశగా స్పందించడం లేదని నివాసితులు ఆరోపిస్తున్నారు. దీంతో పెద్ద ఎత్తున పేరుకుపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోందని అంటున్నారు. బయ్యవరం ప్రధాన కూడలి మీదుగా తేగాడ, బయ్యవరం, జోగారావుపేట, కొత్తపల్లి, బుచ్చెయ్యపేట గ్రామాలకు వందలాది మంది ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తూ ఉంటారు. మారుమూల ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చి ఇక్కడి కూడలి నుంచి ఆటోల ద్వారా అనకాపల్లి, ఎలమంచిలి తదితర ప్రాంతాలకు కూలి పనులకు వెళ్లి వస్తుంటారు. వీరంతా కూడలి వద్దకు వచ్చేసరికి దుర్వాసనను భరించలేక పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

భరించలేని దుర్వాసనతో ఇబ్బందులు

బయ్యవరం దర్గా ఆర్చి వద్ద ఉన్న చెత్త నెలల తరబడి పేరుకుపోయింది. దీని వల్ల తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు పెరిగిపోవడంతో రాత్రి వేళ కంటిమీద కునుకు ఉండడం లేదని అంతా వాపోతున్నారు. తక్షణమే చెత్తను తొలగించి, కాలువలను శుభ్రం చేయాల్సిందిగా అంతా కోరుతున్నారు.

గ్రామంలో తాగునీటి సమస్య

గ్రామంలో తాగునీటి సమస్య నెలకొంది. ఇంటింటికీ పైపులైన్లు వేసినప్పటికీ నీరు సరిగా రావడం లేదు. దీంతో నీటిని పట్టుకునేందుకు దూరంగా వెళ్లాల్సి వస్తుందని మహిళలు వాపోతున్నారు. అసలే వేసవి కాలం కావడంతో మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెపుతున్నారు. పైపులైన్ల ద్వారా నీరు పూర్తి స్థాయిలో వచ్చే వరకు ఇంటింటికీ నీటిని సరఫరా చేయాలని అంతా కోరుతున్నారు. పైపులైన్ ఉన్నచోట మురుగు, చెత్తాచెదారం పేరుకుపోయింది. పైపులైన్ లీకేజీ కారణంగా తాగునీరు కలుషితమవుతోంది. ఈ నీటిని తాగిన వారంతా అంటువ్యాధులు ఎక్కడ సోకుతాయోనని భయాందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు ఇక్కడి సమస్యలపై తక్షణమే స్పందించాల్సిందిగా అంతా కోరతున్నారు.



రోడ్డు పక్కన నిలిచిపోయిన మురుగు

రైతు సేవా కేంద్రం ద్వారా గుర్తింపు కార్డులు

▸▸ రైతులు వీటిని రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

▸▸ ప్రకృతి వ్యవసాయంపై ఏర్పాటైన శిక్షణ శిబిరంలో జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు

కొత్తూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం వెంకుపాలెం రైతు సేవా కేంద్రంలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. వ్యవసాయ శాఖ అధికారులు, మండల, గ్రామ వ్యవసాయ సహాయకులు, ప్రకృతి వ్యసాయ సిబ్బంది హాజరైన ఈ శిబిరంలో జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి ఘన, ద్రవ, జీవామృతాలు, కషాయాలు, పచ్చిరొట్ట ఎరువులు, ఖరీఫ్ యాక్షన్‌పై అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాలు, రాయితీలను రైతులకు వివరించాలన్నారు. రైతు సేవా కేంద్రం ద్వారా రైతులకు గుర్తింపు కార్డులు మంజూరవుతున్నాయని, వీటిని ప్రతి ఒక్కరూ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ప్రతి మండలంలోనూ ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ రామారావు, మండల వ్యసాయాధికారి పి.బి.రంగాచారి, మండల వెలుగు ఏపీఎం కొండమ్మ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

'పెంచిన విద్యుత్ చార్జీల రద్దుకు పోరాటం'

▸▸ అదనంగా సర్దుబాటు చార్జీల వసూలు తగదు

▸▸ వైసీపీ హయాంలో ప్రజలపై రూ.32,166 కోట్ల భారం

▸▸ సీపీఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు



ఆందోళనకు సంబంధించి బ్రోచర్‌లను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : పెంచిన విద్యుత్ చార్జీలు తక్షణమే రద్దు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లు, సెకీ ఒప్పందాలు రద్దు చేయాలని, ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజల పై ఎనలేని భారాలు మోపిన విద్యుత్ సంస్కరణలపై ఈ నెలలో ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు దశల వారీగా పోరాటాలు చేస్తామని ప్రకటించారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన పది నెలల కాలంలో విద్యుత్ చార్జీలు తగ్గించకపోగా అదనంగా సర్దుబాటు చార్జీల భారాన్ని ప్రజలపై మోపిందన్నారు. ప్రతి నెలా యూనిట్‌కు అదనంగా 40పైసలు చొప్పున సర్దుబాటు చార్జీ వసూలు చేస్తుందని ఆరోపించారు. ఎన్నికల ముందు వైఎస్ జగన్ ప్రభుత్వం రూ.32,166 కోట్ల భారాన్ని పేద ప్రజలపై వేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రతి వినియోగదారునిపై భారాన్ని మోపడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. అనంతరం ఇందుకు సంబంధించిన బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు వీవీ శ్రీనివాసరావు, అల్లు రాజు, బి.ఉమామహేశ్వరరావు, ఆర్.శంకరరావు, గంటా శ్రీరామ్ పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాలకు పోటెత్తిన దరఖాస్తుదారులు



అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

పరవాడ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : వివిధ కార్పొరేషన్‌ల రుణాల కోసం ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఇంటర్వ్యూలకు పలు గ్రామాల నుంచి అధికసంఖ్యలో దరఖాస్తుదారులు తరలివచ్చారు. మండల పరిధిలోని పదిహేను గ్రామ పంచాయతీల నుంచి 308 మంది బ్యాంకు రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నారు. వీరికి స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, గ్రామీణ వికాస్ బ్యాంక్, కెనరా బ్యాంక్ అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. దరఖాస్తుదారుల్లో మూడు వందల మంది అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరైనట్లు ఎంపీడీవో కె.ధర్మారావు తెలిపారు. కాగా దరఖాస్తుదారుల ధ్రువపత్రాలను పరిశీలించిన అధికారులు అర్హులైన అభ్యర్థుల జాబితాను పంచాయతీల వారీగా ప్రకటిస్తామని చెప్పారు.

అనకాపల్లి- చోడవరం రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఆందోళన



దర్జీనగర్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు, గ్రామస్థులు

తుమ్మపాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి- చోడవరం రోడ్డు మరమ్మతులు చేపట్టాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం సదరు రోడ్డులోని దర్జీనగర్ వద్ద పార్టీ నాయకులతో కలిసి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి పూర్తిగా గుంతలమయమైందన్నారు. దీనిపై ప్రయాణానికి వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కూటమి పార్టీలన నాయకులు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఈ ఆందోళన కార్యక్రమంలో జిల్లా కార్యవర్గసభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు, గొర్లె దేముడుబాబు, కె.వీరాచారి, కె.బుజ్జి, జె. మహేష్, నాగరాజు, నరాలశెట్టి సత్యనారాయణ, విత్తనాల పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి



జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద అధ్యాపకుల నివాళి

అనకాపల్లి టౌన్/అనకాపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు, వివిధ విభాగాధిపతులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైస్ ప్రిన్సి పాల్ డాక్టర్ ప్రసాద్‌రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కె.మోహనరావు, వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, పట్టణంలోని గుండాల జంక్షన్ వద్ద ఉన్న ఎస్ఆర్ శంకరన్ భవన్‌లో శనివారం జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించనున్నామని కలెక్టర్ విజయ కృష్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరగనున్న ఈ కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా ఆమె కోరారు.

పట్టణ, గ్రామీణ వైసీపీ యువజన, మహిళా విభాగాల నియామకం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని పట్టణ, గ్రామీణ, కశింకోట మండల వైసీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. వైసీపీ అనకాపల్లి పట్టణ యువజన విభాగం అధ్యక్షుడిగా వేగి త్రినాథ్, అనకాపల్లి రూరల్ అధ్యక్షుడిగా బాదపు హరికృష్ణ, కశింకోట మండలం అధ్యక్షుడిగా నీటిపల్లి దివాకర్‌లను నియమించింది. మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలిగా దొడ్డి రామలక్ష్మి, మండల విభాగం అధ్యక్షురాలిగా కె.పద్మకుమారి, కశింకోట మండలం అధ్యక్షురాలిగా తగరంపూడి నూకరత్నంలను నియమిస్తేన్నట్టు పేర్కొంది. వీరి నియామకం పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.

'నిర్వాసితులకు ద్రోహం చేయవద్దు'

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో నిర్వాసితులకు ద్రోహం చేయవద్దని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఇక్కడ మాట్లాడుతూ నక్కపల్లి ప్రాంతంలో మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు, డీఎల్‌పురం వద్ద పోర్టుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపడం పట్ల సీపీఎం తీవ్ర అభ్యంతరం తెలుపుతుందన్నారు. భూములు సేకరించిన నిర్వాసితులకు నేటికీ పూర్తిస్థాయిలో ఎటువంటి పరిహారం, ప్యాకేజీ, పునరావాసం కల్పించకుండా వారిని అనేక ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు ఏకపక్షంగా అనుమతులు ఇవ్వడమంటే నిర్వాసితులకు ద్రోహం చేయడమేనన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో కార్పొరేట్ సేవలో మునిగి తేలుతున్న ప్రభుత్వానికి పేదల ప్రజల సమస్యలు పరిష్కరించడంలో చిత్తశుద్ధి లేదని ఆరోపించారు.

బహిరంగ ప్రదేశంలో

మద్యం సేవిస్తున్న ఐదుగిరిపై కేసు

డ్రోన్ ద్వారా గుర్తించిన పోలీసులు



బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న వారిని పట్టుకున్న ఎస్ఐ

పరవాడ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భరణికం గ్రామ శివారులో గల బహిరంగ ప్రదేశంలో కొంతమంది మద్యం సేవిస్తున్నట్టు శుక్రవారం పోలీసులు డ్రోన్ సాయంతో గుర్తించారు. వెంటనే ఎస్ఐ బి.కృష్ణారావు తన సిబ్బందితో అక్కడికి చేరుకొని మద్యం సేవిస్తున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కేసులు తప్పవని ఈ సందర్భంగా ఎస్ఐ హెచ్చరించారు.

సీతారాముల కల్యాణానికి ముహూర్తపు రాట

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామ నవమిని పురస్కరించుకుని పట్టణంలోని పలుచోట్ల శుక్రవారం ముహూర్తపు రాటను వేశారు. ఆదివారం జరగనున్న ఈ వేడుకల్లో భాగంగా పెదరామస్వామి కోవెల వద్ద టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ కుటుంబ సమేతంగా హాజరై స్వామివారి పెళ్లి రాట వేశారు. ఈ కార్యక్రమంలో కొణతాల సత్యనారాయణ, మళ్ల రాజా, కర్రి శివన్నారాయణ, బుద్ద లావణ్య, పెంటకోట సౌజన్య తదితరులు పాల్గొన్నారు. అలాగే చినరామస్వామి కోవెల వద్ద ఆలయ ధర్మకర్త విల్లూరి మహాలక్ష్మినాయుడు, ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ విల్లూరి పైడారావు దంపతులు శ్రీరాముని కల్యాణ రాట ముహూర్తం నిర్వహించారు. ఈ



చినరామస్వామి కోవెల వద్ద రాటోత్సవంలో భక్తులు



పెదరామస్వామి కోవెల వద్ద రాటకు పూజలు చేస్తున్న భక్తులు

కార్యక్రమంలో పిళ్లా జగన్నాథంనాయుడు, కర్రి దివాకర్, విల్లూరి రామచంద్రరావు, బొడ్డేడ మురళీ, మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు. మెయిన్ రోడ్డులోని చినబజార్ వద్ద సీతారాముల కల్యాణ రాటను వేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ శాశ్వత గౌరవాధ్యక్షుడు కొణతాల జగన్నాథరావునాయుడు, అధ్యక్షులు కె.నారాయణరావు, కార్యదర్శి సిరసపల్లి సూరిబాబు, కోశాధికారి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : సీతారాముల కల్యాణాన్ని పురస్కరించుకుని మండల కేంద్రం సబ్బవరంలో గల రామాలయం ఆవరణలో ముహూర్తపు రాటను వేశారు. ఈ వేడకకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై విజయవంతం చేయాల్సిందిగా నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దెడ్డం ప్రసాద్, ఉత్సవ కమిటీ ప్రతినిధులు దంగేటి నాగేశ్వరరావు, ప్రకాశ్, బేతిన శ్రీనివాసరావు, బర్ల రమణ, కొల్లి గంగునాయుడు, గెడ్డం రమేశ్, కోరాడ శ్రీను, చింతల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



అనకాపల్లి మెయిన్‌రోడ్డులోని చినబజార్ ఆలయం వద్ద..



సబ్బవరంలోని రాముని ఆలయం వద్ద...

ఘనంగా సీతారాముల కల్యాణం రాట



రామాలయంలో పెళ్లిరాట వేస్తున్న భక్తులు

చింతపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామాలయంలో శుక్రవారం ఉదయం సీతారాముల పెళ్లిరాటను భక్తులు ప్రతిష్ఠించారు.ఈసందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ శ్రీరామనవమి పురస్కరించుకుని ఆదివారం సీతారాముల కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నామన్నారు. ప్రత్యేక పూజలు, హోమం, అన్నసమారాధన ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్త మాదాబత్తుల సత్తిబాబు, వర్తక సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జోగేశ్వరరావు, పెదిరెడ్ల బేతాళుడు, హెచ్‌డబ్ల్యూవో పసుపులేటి వినాయకరావు, కమిటీ సభ్యుడు బంగారయ్యశెట్టి, ఎంపీటీసీ సభ్యులు ధారలక్ష్మి పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ

పాడేరురూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా రాణించాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శరగడం శ్రీనివాస్‌రావు అన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా ఈ విద్యా సంవత్సరం ప్రారంభం కాకుండానే ఇంటర్ విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలు సరఫరా చేసిందన్నారు. ప్రభుత్వ సరఫరా చేసిన పుస్తకాలను ద్వితీయ ఇంటర్ విద్యార్థులకు శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో విద్యా సంవత్సరం చివరి వరకు పుస్తకాలు అందేవి కాలేదన్నారు. ఈ ఏడాది ముందుగానే పుస్తకాలు పంపిణీ చేయడంపై ఆయన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు చీపురు రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు భేష్: సీఐ



విద్యార్థినులకు కీడా సామగ్రిని అందజేస్తున్న సీఐ హిమగిరి

అనంతగిరి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో స్వచ్ఛంద సంస్థలు సేవలు అభినందనీయమని అరకు సీఐ హిమగిరి అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలకల-1, 2 పాఠశాలల విద్యార్థినులకు వైజాగ్ వలంటీర్లు సంస్థ ఆధ్వర్యంలోని క్రీడా సామగ్రి, నోట్ పుస్తకాలు, పెన్నులు, పౌష్టికాహారం తదితర వాటిని శుక్రవారం అందజేశారు. ఈసందర్భంగా సీఐ హిమగిరి మాట్లాడుతూ.. విద్యార్థినులు చదువుల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలోని అనంతగిరి ఎస్ఐ డి.శ్రీనివాసరావు, ట్రైనీ ఎస్ఐ షాహిబ అంజుం, మెట్రీస్ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

కేఎస్ఆర్ ట్రస్ట్‌తో సేవా కార్యక్రమాలు

హుకుంపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): దివంగత ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు పేరిట ఏర్పాటు చేసిన కేఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా గిరిజన ప్రాంతంలో సామాజిక సేవా కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహిస్తామని జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. సర్వేశ్వరరావు 53వ జయంతిని పురస్కరించుకుని మండలంలో బాకూరు గ్రామంలో కేఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌కు శుక్రవారం ఆయన ప్రారంభించారు.కార్యక్రమంలో సర్పంచ్, టీడీపీ సీనియర్ నేత బాకూరు వెంకటరమణరాజు, నేతలు పాండురంగస్వామి, సాగర సుబ్బారావు, సూర్యాకాంతం, నూకరత్నం, ద్రౌపతి,శశిభూషణ్‌నాయుడు పాల్గొన్నారు.

ఘనంగా ఫేర్‌వెల్ అండ్ యాన్యువల్ డే

పాడేరురూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో శుక్రవారం ఫేర్‌వెల్ అండ్ యాన్యువల్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్.వనుము చిట్టిబ్బాయి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదువులపై దృష్టి సారించాలని సూచించారు. పోటీ పరీక్షలకు శిక్షణ పొందాలని, శాస్త్ర సాంకేతిక రంగాల్లో ముందుండాలన్నారు. ఐదో సెమిస్టర్‌లో ప్రతిభ కనపర్చిన వారికి ప్రోత్సాహక బహుమతులను అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్.టీఎస్.రసూల్, ఐక్యూఏస్సీ కో-ఆర్డినేటర్ పి.కోటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ పీవో వి.రమేశ్‌బాబు, జానకీరామ్, గౌరీశంకరరావు, అచ్చుత్, మహిళా సాధికారిక కన్వీనర్ బి.సౌజన్య, జి.దామోదర్, జి.భాస్కరరావు, సునీత, రాధాకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి కనువిందు



భీసుపురం వద్ద కర్రల వ్యూ పాయింట్

అనంతగిరి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఆ కొండ అంచున నిల్చుంటే.. కిందన లోయ.. ఎదుట పచ్చదనంతో గిరులు.. నీలిఆకాశం... ఈ అందాలన్నీ మండలంలోని అరకు-విశాఖ ప్రధాన రహదారి ఆనుకుని భీసుపురం కర్రల వ్యూపాయింట్ వద్ద కనువిందు చేస్తున్నాయి. స్థానిక గిరిజనులు దీనిని కర్రలతో ఏర్పాటు చేశారు. అరకు వచ్చే పర్యాటకులు ఈ వ్యూపాయింట్ వద్ద తప్పనిసరిగాకొద్దిసేపు నిల్చొని కిందని ప్రకృతి అందాలను వీక్షిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం పొగమంచు ప్రకృతి ప్రేమికులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

బహుళ ప్రయోజన భవనాలు పూర్తి చేయాలి

» ఐటీడీఏ ఏపీవోలు ప్రభాకరరావు, వెంకటేశ్వరరావు



వివిధ శాఖల అధికారులతో సమావేశమైన ఐటీడీఏ ఏపీవోలు

పాడేరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో ఆదిమ జాతి గిరిజనులకు గ్రామాలకు మంజూరు చేసిన బహుళ ప్రయోజన భవన నిర్మాణాలు వేగంగా పూర్తిచేయాలని ఐటీడీఏ ఏపీవోలు వీఎస్ ప్రభాకరరావు, ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. వివిధ శాఖలకు చెందిన అధికారులతో శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రధానమంత్రి జన్‌మన్ యోజనలో ఐటీడీఏ పరిధిలో ఆదిమ జాతి గిరిజన గ్రామాలకు 34 బహుళ ప్రయోజన భవనాలు మంజూరయ్యాయన్నారు. పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, హెల్త్ సబ్‌సెంటర్లకు భవనాలు లేని చోట రూ. 60 లక్షల వ్యయంతో ఈ బహుళ ప్రయోజన భవనాలు నిర్మిస్తామన్నారు. నిర్మాణం పూర్తయిన ఆయా భవనాలకు పూర్తి స్థాయిలో విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పించి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఈఈ జి.డేవిడ్‌రాజు, జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ జమాల్‌బాషా, జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు, ఐసీడీఎస్ పీడీ ఎన్.సూర్యలక్ష్మి, టీడబ్ల్యూ డీడీ ఎల్.రజని, వెలుగు డీపీఎం వీఎస్ ప్రసాద్, ఏజెన్సీ పరిధిలోని పదకొండు మండలాల సీడీపీవోలు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

» జిల్లా పంచాయతీ అధికారి లోవరాజు



టోకూరు సచివాలయంలో మాట్లాడుతున్న డీపీవో లోవరాజు

అనంతగిరి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): విధుల్లో అలసత్వం వహించకుండా సచివాలయ ఉద్యోగులు సేవలను అందించాలని జిల్లా పంచాయతీ అధికారి లోవరాజు ఆదేశించారు. మండలంలోని టోకూరు సచివాలయంలోని సచివాలయం ఉద్యోగులతో శుక్రవారం సమావేశమయ్యారు.. సచివాలయానికి వచ్చిన వెంటనే సిబ్బంది ముఖ ఆధారిత హాజరు వేయాలని, క్షేత్రస్థాయి పర్యటనలో మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. గ్రామ సచివాలయంలోని 11 రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా అవగాహన కల్పించాలన్నారు. తాగునీటి ట్యాంక్‌లో క్లోరినేషన్ తప్పనిసరిగా చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఏవీవీ కుమార్, విస్తరణ అధికారి ధర్మ, సర్పంచ్ మోస్య పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం



చెరుకుమల్లులో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి హిమబిందు

సీలేరు, ఏప్రిల్ 4 , (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ధారకొండ పీహెచ్‌సీ వైద్యాధికారి డీకే హిమబిందు గిరిజనులకు సూచించారు. పీహెచ్‌సీ పరిధిలోని చెరుకుమల్లు గ్రామంలో శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 102 మందికి వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి గిరిజనులతో మాట్లాడుతూ వాతావరణంలో మార్పులతో గిరిజన గ్రామాల్లో వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయన్నారు. వ్యాధులు సోకిన వెంటనే ఆసుపత్రికి వచ్చి వైద్య సేవలను చేయించుకోవాలని, నాటు వైద్యంను ఆశ్రయించ వద్దని అవగాహన కల్పించారు. గర్భిణులు విధిగా ఆసుపత్రికి వచ్చి తనిఖీ చేయించుకోవాలని , ప్రసవ సమయంలో ముందుగానే ఆసుపత్రిలో చేరితే తల్లీ, బిడ్డలకు ఎటువంటి హాని ఉండదని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ పి. లోవకుమారి, ఏఎన్ఎంలు సీత, మత్స్యకొండ పాల్గొన్నారు.

భూములను పరిరక్షించాలని ఆదివాసీలు ధర్నా



ఐటీడీఏ కార్యాలయం వద్ద ధర్నా చేపడుతున్న చటర్జీపురం గిరిజనులు

పాడేరురూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అనంతగిరి మండలం భీంపోలు పంచాయతీ సిమిడివలస గిరిజనుల భూములను రెవెన్యూ, అటవీశాఖాధికారులు సంయుక్తంగా సర్వే చేపట్టి గిరిజనేతర రియల్ ఎస్టేట్ వ్యాపారులు, అటవీశాఖాధికారుల వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ సీపీఎం నాయకులు కోరారు. ఈమేరకు ఆ గ్రామ గిరిజనులు ఐటీడీఏ ఎదుట శుక్రవారం ధర్నా చేపట్టారు. కలెక్టర్ దినేశ్‌కుమార్‌కు వినతిపత్రచ్చారు.

చటర్జీపురం గిరిజనులు నిరసన

అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం ఎంకే.పట్నం రెవెన్యూ గ్రామంలోని నివసిస్తున్న చటర్జీపురం పీవీటీజీ గిరిజనులకు కొయ్యూరు మండలం వైసీపీ జడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు నుంచి రక్షణ కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా కన్వీనర్ రామారావు దొర డిమాండ్ చేశారు. చటర్జీపురం గిరిజనులు ఐటీడీఏ ఎదుట నిరసన తెలిపారు. రామారావు దొర మాట్లాడుతూచటర్జీపురంగిరిజనులు భూమిని స్వాధీనం చేసుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. గిరిజన విద్యార్థి సంఘం నాయకులు కె.కిశోర్, బి.మాధవరావు, జేఏసీ నాయకులు టి.సురేష్‌బాబు పాల్గొన్నారు.

సహజ ప్రసవాలకే తొలి ప్రాధాన్యం

» అనకాపల్లి జిల్లా ఆస్పత్రి స్త్రీ వైద్యనిపుణురాలు అస్మా



గర్భిణులకు కౌన్సెలింగ్ చేస్తున్న అస్మా

చింతపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో సహజ ప్రసవాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు అనకాపల్లి జిల్లా ఆస్పత్రి స్త్రీ వైద్యనిపుణులు అస్మా తెలిపారు. శుక్రవారం స్థానిక ఏరియా ఆస్పత్రి లో గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు, అల్ట్రాసౌండ్ స్కానింగ్‌లు నిర్వహించారు. అనంతరం కౌన్సెలింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సహజ ప్రసవం తల్లికి ఆరోగ్య కరమన్నారు. సహజప్రసవంతో తల్లి రెండుమూడు రోజులు ఆస్పత్రిలో ఉంటే సరిపోతుందన్నారు. గర్భిణులకు వైద్యులు సహజ ప్రసవానికి అధిక ప్రాధాన్యం ఇస్తారన్నారు. అత్యవస పరిస్థితుల్లో మాత్రమే సిజేరియన్ చేయాల్సివస్తుందన్నారు. కొంతమంది పురిటినొప్పులు భరించలేక సిజేరియన్‌కు ముందుకొస్తున్నారన్నారు. అవసరంలేకుండా ఇలాంటి శస్త్రచికిత్సలు మంచిదికాదన్నారు. గర్భిణులు గృహాల్లో ప్రసవం పొందరాదన్నారు. ప్రసవ సమయానికి పది రోజులు ముందు ఆస్పత్రిలో చేరి, వైద్యుల పర్యవేక్షణలో ప్రసవం పొందాలన్నారు. వసతి గృహాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ పి. ఇందిరాప్రియాంక పాల్గొన్నారు.

బీసీ రుణాలతో యువతకు ఉపాధి

పెదబయలు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ద్వారా మంజూరు చేస్తున్న సబ్సిడీ రుణాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందాలని ఎంపీడీవో పూర్ణయ్య కోరారు. రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఇంటర్వ్యూలు నిర్వహించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎస్‌బీఐ , గ్రామీణ వికాస్ బ్యాంక్ మేనేజర్‌లతో కలసి 12 మందికి ఇంటర్వ్యూలు చేసి, తొమ్మిది యూనిట్లకు లబ్ధిదారులను ఎంపిక చేసినట్టు ఎంపీడీవో తెలిపారు.

150 మందికి క్యాన్సర్ వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న ప్రత్యేక వైద్యులు

పాడేరురూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): స్థానిక మేజర్ పంచాయతీ సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి, ఆమె సోదరుడు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొట్టగుళ్లి సుబ్బారావు ఆధ్వర్యాన స్థానిక మోదకొండమ్మ ఆడిటోరియంలో శుక్రవారం హెచ్‌సీజీ క్యాన్సర్ సెంటర్ సిబ్బంది ఏర్పాటు చేసిన ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరాన్ని కలెక్టర్ ఏఎస్.దినేశ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి ప్రత్యేక వైద్య శిబిరాలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. . అనంతరం సుబ్బారావు మాట్లాడుతూ ఈ శిబిరంలో 158 మంది రోగులకు పరీక్షలను నిర్వహించినట్టు చెప్పారు. కొందరికి బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలు చేసినట్టు చెప్పారు. ఈ వైద్య శిబిరంలో డీఎంహెచ్‌వో షేక్ జమీల్ భాషా, ఎంపీడీవో జె.తేజరతన్, ఈవోపీఆర్డీ ఆర్‌వీఎస్.రమేశ్ వైస్ ప్రెసిడెంట్ బూరెడ్డి రామునాయుడు, వార్డు సభ్యులు, స్థానిక హెల్త్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘన వ్యర్థాల నిర్వహణపై శిక్షణ

పెదబయలు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని అడుగులపుట్టు శిక్షణ కేంద్రంలో ముంచంగిపుట్టు, పెదబయలు మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులకు, క్లాప్ మిత్రలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించినట్టు స్థానిక ఎంపీడీవో పూర్ణయ్య తెలిపారు. క్లాప్ మిత్రలు సేకరించిన ఘన వ్యర్థాల నిర్వహణ ఏ విధంగా చేయాలనేది ఈ శిక్షణ ఉద్దేశమని తెలిపారు. అలాగే సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధం, రోజువారి తడి,పొడి చెత్త సేకరణ, చెత్త నుంచి సంపద సృష్టి విధానం, వర్మీ కంపోస్టు తయారీ చేకూరే ప్రయోజనాలు వివరించామన్నారు. ప్రకృతి వ్యవసాయం యొక్క ప్రాధాన్యతలపై శిక్షణ అందించామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ విస్తరణ అధికారి నరసింరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రాగల ఐదు రోజుల్లో మోస్తరు వర్షాలు

చింతపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రాగల ఐదు రోజుల్లో తేలిపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. శుక్రవారం వాతావరణ సమాచారాన్ని శాస్త్రవేత్తలు ప్రకటించారు. ఈమేరకు ఈనెల తొమ్మిదో తేదీ వరకు రంపచోడవరం, చింతపల్లి, పాడేరు, అరకు డివిజన్ల పరిధిలో కనిష్ఠంగా 3 మిల్లీమీటర్లు, గరిష్ఠంగా 10మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవుతుందన్నారు.

కిశోర బాలికల సంరక్షణపై శ్రద్ధ : సీడీపీవో

చింతపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికల సంరక్షణపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రాజెక్టు ఐసీడీఎస్ సీడీపీవో జీవీ రమణ అన్నారు. శుక్రవారం స్థానిక బాలికల ఆశ్రమ పాఠశాలలో ఐసీ డీఎస్ అధికారులు కిశోరి వికాసంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూయుక్తవయస్సులో ప్రవేశించిన బాలికల స్వేచ్ఛకు భంగం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బాలికలు విద్యలో రాణించేందుకు కృషి చేయాలన్నారు. వివాహ వయసు రాకుండా వివాహాలు చేయరాదన్నారు. శారీరక మార్పులను, సమాజంలో ఏవిధంగా మెలగాలనే విషయాలను తల్లిదండ్రులు బోధించాలన్నారు. మహిళ హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆరోగ్య పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలుసుకోవాలన్నారు. పోషకాహారం తీసుకోవాలన్నారు. సోషల్ మీడియం, అపరిచిత పరిచయా లు, సైబర్ నేరగాళ్లపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, కె.విజయకుమారి, ఎస్కే. గౌహర్ ఉన్నీష, ఎస్. గౌరి, పి. అప్పలనర్స పాల్గొన్నారు.

బాల్య వివాహం నిలిపివేత



తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఐసీడీఎస్ అధికారులు

గూడెంకొత్తవీధి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జి.కొత్తపాలెం గ్రామంలో బాల్యవివాహాన్ని ఐసీడీఎస్ అధికారులు నిలిపివేశారు. గ్రామానికి చెందిన పాంగి రాజు, నందిని దంపతుల కుమారుడు ఇస్సాక్, చింతపల్లి మండలం అన్నవరం పంచాయతీ పూసన్నపాలెంనకు చెందిన కొర్ర చిన్నారావు, హర్ని దంపతుల కుమార్తె నందినికి శుక్రవారం వివాహానికి కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేశారు. వరుడు వయస్సు 20, వధువు వయసు 16 ఏళ్లు కావడంతో స్థానికులు ఐసీడీఎస్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వలసమ్మ, మహిళా కానిస్టేబుల్ శాంతి గ్రామానికి వెళ్లి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేశారు. బాల్య వివాహం చట్టరీత్యా నేరమని, బాలిక పలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సివస్తుందని వివరించారు. వివాహం చేసేందుకు వచ్చిన పాస్టర్లను సైతం అధికారులు నిలదీశారు. దీంతో ఇస్సాక్, నందినిల వివాహం రద్దు చేశారు. అయితే, ఈ వేడుకకు వచ్చిన అతిథులు విందు భోజనాలు చేసి వెళ్లిపోయారు.

'పవన్ కల్యాణ్ పర్యటన జయప్రదం చేయాలి'

డుంబ్రిగుడ,ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అరకు నియోజకవర్గం మన్యం ప్రాంతంలో ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవణ్ కల్యాణ్ పర్యటనను విజయవంతం చేయాలని జనసేన మండల అధ్యక్షుడు ధనేశ్వరరావు కార్యకర్తలు, నాయకులను కోరారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 7న పవన్‌కల్యాణ్ పర్యటించనున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చినప్పటినుంచి గిరిజన అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. ఈక్రమంలో పార్టీ అధినేత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మన్యం ప్రాంతంలో వస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి వంతల రమణమూర్తి, ధర్మారావు, కృష్ణ, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

కిడారి సర్వేశ్వరరావు ఆశయ సాధనకు కృషి

» జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కుమార్



పాడేరులో కిడారి ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న శ్రావణ్‌కుమార్, టీడీపీ నేతలు

పాడేరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): దివంగ ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు ఆశయ సాధనకు కృషి చేస్తానని టీడీపీ అరకు పార్లమెంటరీ అధ్యక్షుడు, గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. సర్వేశ్వరరావు 53వ జయంతి పురస్కరించుకుని శుక్రవారం స్థానిక కిడారి ఘాట్ వద్ద ఆయనకు నివాళులు అర్పించారు. ఈసందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడారు. గిరిజన ప్రాంత అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి నిత్యం తపించే తన తండ్రి సర్వేశ్వరరావు బాటలోనే తాను పయనిస్తానన్నారు. కష్టంలో కుటుంబానికి అండగా నిలిచిన సీఎం చంద్రబాబునాయుడు, టీడీపీ కుటుంబ సభ్యులకు .జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. అలాగే తండ్రి జ్ఞాపకార్థం కేఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలను చేపడతామన్నారు. ఈకార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మత్స్యరాస మణికుమారి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, జీసీసీమాజీ చైర్మన్ శెట్టి లక్ష్మణుడు, టీడీపీ సీనియర్ నేతలు చల్లంగి లక్ష్మణరావు, సాగర సుబ్బారావు, పాండురంగస్వామి, బాకూరు వెంకటరమణరాజు, పి.శశిభూషణ్ నాయుడు,టి.సత్యనారాయణ, ఎస్.సూర్యకాంతం, కొమ్మా రమ, బీజేపీ నేతలు పాంగి రాజారావు, కూడ కృష్ణారావు, కూటమి శ్రేణులు,, కిడారి అభిమానులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో బహుళ ప్రయోజనాలు: ఏడీఏ



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ జాహ్నవి

చింతపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో బహుళ ప్రయోజనాలు పొందవచ్చునని స్థానిక వ్యవసాయశాఖ సహాయక సంచాలకులు (ఏడీఏ) కంటా జాహ్నవి అన్నారు. శుక్రవారం మండల కేంద్రం స్త్రీశక్తి భవనంలో వ్యవసాయశాఖ ఉద్యోగులు, గ్రామాఖ్య సంఘాల సభ్యులతో ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాస్‌రావు అధ్యక్షతన అవగాహన కార్యక్రమం జరిగింది. ఏడీఏ మాట్లాడుతూ గిరిజన ప్రాంతం సేంద్రీయ వ్యవసాయానికి అత్యంత అనుకూలమన్నారు. ఈ ప్రాంత భూములు రసాయనిక ఎరువులు, పురుగు మందుల వల్ల కలుషితం కాలేదన్నారు. గిరిజనులు వ్యవసాయ పంటలన్నీ సేంద్రీయ పద్ధతిలోనే సాగు చేయాలన్నారు. ఈ పంటలకు మార్కెట్‌లో అధిక డిమాండ్ ఉందన్నారు. పెట్టుబడుల ఖర్చు తగ్గుతుందన్నారు. పంటలు, నేలలు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. ఈకార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాసరావు, వ్యవసాయ అధికారి బి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నిర్దిష్ట సమయానికి పనులు జరగాలి



వి.కోడాపల్లిలో నర్సరీని పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారి

జి.మాడుగుల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నిర్దిష్ట సమయానికి అభివృద్ధి పనులు జరిగేలా చూడాలని అటవీశాఖ ఫ్లాయింగ్ స్క్వాడ్ శ్రీనివాసరావు ఆదేశించారు. జి.మాడుగుల అటవీ రేంజ్ పరిధి బీరం పంచాయతీ వి.కోడాపల్లి (వెంకటపాలెం), బీరం గ్రామాల్లో ఆ శాఖ ద్వారా చేపట్టిన పనులను ఆయన శుక్రవారం తనిఖీలు చేపట్టారు. కాంపా పథకం ద్వారా ముందస్తు పనులు, ఉపాధి పథకం ద్వారా పలు జాతుల మొక్కల పెంపకం నర్సరీలను క్షుణ్ణంగా పరిశీలించారు. అవకతవలకు వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. అతని వెంట రేంజ్ అధికారి ఇర్.అప్పలనాయుడు, సెక్షన్ అధికారులు ఎఫ్ఎస్‌వోలు శ్రీరాములు, వివినాయుడు, ఎస్ శ్రీనివాస్, బీట్ అధికారులు కె.కిరాణ్, మాధవి, సిబ్బంది సత్తిబాబు, బాలన్న పాల్గొన్నారు.

7 నుంచి వెంకటేశ్వరస్వామి ఉత్సవాలు



ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం, తదితరులు

అరకులోయ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలో ఈనెల 7 నుంచి 11 వరకు నిర్వహించనున్న వెంకటేశ్వరస్వామి ఉత్సవాలను విజయవంతం చేయాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం పిలుపునిచ్చారు. శుక్రవారం ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను స్థానిక సర్పంచ్ పెట్టెలి దాసుబాబు, అరకు సీఐ హిమగిరి, ఆలయా కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏటా ఈ ఉత్సవాలను నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. ఈ సారి వచ్చే భక్తులకు ఏటువంటి ఇబ్బందులు తలెత్తకుండాచర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు బాబూరావు, వైసీపీ నేత అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ నేతకు పరామర్శ



చికిత్స పొందుతున్న టీడీపీ మండలాధ్యక్షుడు పూర్ణచంద్రరావుని పరామర్శిస్తున్న ఈశ్వరి

చింతపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న స్థానిక టీడీపీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావునిపాడేరు నియోజక వర్గం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మె ల్యే గిడ్డి ఈశ్వరి పరామర్శించారు. పూర్ణచం ద్రరావు వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నారు. రెండు రోజుల క్రితం ఆస్పత్రిలో చేరాడు. వైద్యులు పరీక్షలు నిర్వహించి డెంగ్యూ లక్షణాలు ఉన్నట్టు గుర్తించారు. వెంటనే నర్సీపట్నం ఆస్పత్రికి తరలించారు. ఈ స్థితిలో పూర్ణచంద్రరావుని శుక్రవారం ఈశ్వరి, నాయకులు వెళ్లి పరామర్శించారు. ఆయన కోలుకుంటున్నట్టు ఈశ్వరి తెలిపారు. ఈకార్యక్రమంలో నాయకులు అబ్బాయినాయుడు, కేశ్వరరావు, లక్ష్మణరావు, వల్లి పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం కల్పించొద్దు: ఎస్ఐ

ముంచంగిపుట్టు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అపరిచిత వ్యక్తులకు ఎవరూ ఆశ్రయం కల్పించరాదని స్థానిక ఎస్ఐ జె.రామకృష్ణ అన్నారు.శుక్రవారం మండల కేంద్రంలో నాలుగు రోడ్ల కూడలిపై వాహన తనిఖీలు చేపట్టారు. నిబంధనలు పాటించాలని, వ్యతిరేకంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే గ్రామ శివారులోని ఇళ్లకువెళ్లి యజమానులతో మాట్లాడారు.అపరిచితులకు ఇళ్లను అద్దెకు ఇవ్వొద్దన్నారు. అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే సమాచారమందించాలన్నారు.

నేటి నుంచి క్రికెట్ పోటీలు

అనంతగిరి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అంబేడ్కర్ జయంతి పురస్కరించుకుని శనివారం నుంచి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్టు జడ్పీటీసీ సభ్యుడు దీసరి గంగరాజు తెలిపారు. గిరిజన సంఘం ఆధ్వర్యంలోని యూత్ అధ్వర్యంలో జరిగే ఈ క్రీడా పోటీలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలనిన్నారు. వివరాలకు ఫోన్: 9381188620, 6302057448 నంబర్లను సంప్రదించాలని కోరారు.

నియోజకవర్గ సమస్యలపై కలెక్టర్‌కు వినతి


సమస్యలపై కలెక్టర్‌కు నివేదిక ఇస్తున్న జనసేన ఇన్‌చార్జి రాజు

చోడవరం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలపై తగిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌కు జనసేన ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ప్రధానంగా రహదారుల అభివృద్ధి ఇతర అంశాలను ఆమె దృష్టిలో పెట్టారు. అలాగే రావికమతం మండలంలోనిచలిసింగం రహదారి సమస్య పరిష్కారానికి కలెక్టర్ చేసిన కృషికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే బీఎన్ రోడ్డు సమస్య కూడా పరిష్కారమయ్యేలా చూడాలని కలెక్టర్‌కు రాజు విజ్ఞప్తి చేశారు.

ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

రోలుగుంట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుచ్చెంపేటలో నూతనంగా నిర్మించిన రామాలయంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ ఉలబాల పోతురాజునాయుడు ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు పాల్గొని స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు బలిజి మహారాజు, నాయకులు అనిమిరెడ్డి మహేశ్వరి, గాలి బాలరాజు, పరవాడ దొరబాబు, అరిపి త్రినాథ్ పాల్గొన్నారు.

పంట కాలువలో పూడికతీతకు చర్యలు

▸▸ ఇరిగేషన్ జేఈ రామన్నపాత్రుడు


గుండుపాల పంట కాలువను పరిశీలిస్తున్న ఛైర్మన్, అధికారులు

గొలుగొండ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రావణాపల్లి రిజర్వాయర్ కింద గుండుపాల పంట కాలువలో పూడికతీత పనులకు చర్యలు చేపడుతున్నామని ఇరిగేషన్ జేఈ రామన్నపాత్రుడు తెలిపారు. శుక్రవారం రిజర్వాయర్ ఛైర్మన్ రుత్తల రాజేశ్వరరావుతో కలిసి గుండుపాల పంట కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువలో పూడికతీతలతో పాటు గేట్ల మరమ్మతులకు అంచనాలు తయారు చేస్తామన్నారు. ఛైర్మన్ రుత్తల రాజేశ్వరరావు మాట్లాడుతూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశాలతో గుండుపాల నుంచి బలిఘట్టం వరకు పంటకాలువలో పూడికతీత పనులు, గేట్లు మరమ్మతులు చేపట్టేందుకు రూ.40 లక్షలతో అంచనా వేసినట్టు చెప్పారు. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజర్వాయర్ కమిటీ డైరెక్టర్ లాలం వెంకటరమణ, టీడీపీ పట్టణ కార్యదర్శి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నూకాలమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.1.32 లక్షలు


ఆదాయం లెక్కిస్తున్న దేవదాయ అధికారులు, కమిటీ సభ్యులు

కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): లింగంపేట నూకాలమ్మతల్లి ఆలయ హుండీ ఆదాయం రూ.1.32 లక్షలు వచ్చినట్టు దేవదాయ శాఖ ఈవో టి.దివ్యతేజ తెలిపారు. కొత్త అమావాస్య సందర్భంగా నిర్వహించిన జాతరలో వచ్చిన హుండీ ఆదాయాన్ని శుక్రవారం లెక్కించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో రూ.60 వేలు మించి ఆదాయం రాలేదన్నారు. ప్రస్తుతం సీసీ కెమెరాల ఏర్పాటుతో గతంలో ఎన్నడూ లేని విధంగా ఆదాయం రావడం విశేషమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వై.తారకేశ్వరరావు, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఉమాదేవి, నూకాలమ్మ ఆలయం, ఉత్సవ కమిటీ ఛైర్మన్లు కె.వరలక్ష్మి, కొండలరావు, లంక సత్యనారాయణ, మాజీ సర్పంచ్ పి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

సంపద కేంద్రాలు వినియోగంలో ఉండాలి

▸▸ మండల పత్యేకాధికారి మోహనరావు


సంపద కేంద్రాన్ని పరిశీలించిన మండల ప్రత్యేక అధికారి

మాకవరపాలెం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రతీ గ్రామంలో సంపద కేంద్రాలు వినియోగంలో ఉండాలని మండల పత్యేకాధికారి మోహనరావు స్పష్టం చేశారు. మండలంలోని బయ్యవరం గ్రామంలో సంపద కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేరు చేయాలన్నారు. ప్రజలు చెత్తను ఎక్కడిబడితే అక్కడ వేయకుండా ప్రభుత్వం పంపిణీ చేసిన బుట్లల్లో వేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అలాగే ఎక్కడా తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతామహాలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి పాల్గొనారు.

ఎంపీపీ సర్వేశ్వరరావు బాధ్యతల స్వీకారం


ఎంపీపీకి అభినంధనలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే గణేశ్, నేతలు

మాకవరపాలెం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మాకవరపాలెం ఎంపీపీగా రుత్తల సర్వేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గత నెల 27వ తేదీన జరిగిన ఎంపీపీ ఎన్నికల్లో సర్వేశ్వరరావును ఎంపీపీగా సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్న విషయం తెలిసిందే. దీంతో మండల పరిషత్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్, వైసీపీ మండల అధ్యక్షుడు చిటికల వెంకటరమణ, పార్టీ నేత రుత్తల యర్రాపాత్రుడు ఆయన్ను అభినందించారు.

మోడల్ ప్రైమరీ పాఠశాలగా వడ్డాది స్కూల్

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వడ్డాది గ్రామంలో మెయిన్ పాఠశాలను మోడల్ ప్రైమరీ పాఠశాలగా ప్రభుత్వం ప్రకటించింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ పాఠశాలలో ఎల్‌కేజీ, యూకేజీ అడ్మిషన్లు చేపడుతున్నట్టు హెచ్ఎం శేషగిరిరావు తెలిపారు. ఈ నేపథ్యంలో శుక్రవారం తమ స్కూల్ అడ్మిషన్ల గురించి హెచ్ఎం ప్రచారం చేశారు. ప్రైవేట్ బడుల్లో చేర్పించకుండా తమ స్కూల్‌లో చేర్పించాలని, ప్రైవేట్ పాఠశాలలకు మించి నాణ్యమైన విద్యనందిస్తామని భరోసా ఇచ్చారు.

సమస్యల స్టేషన్

▸▸ ఆర్టీసీ కాంప్లెక్స్‌లో సదుపాయాలు కరువు

▸▸ బెంచీల మరమ్మతులు.. కానరాని ఫ్యాన్లు

▸▸ పరిసరాలు అధ్వానం.. పనిచేయని తాగునీటి పథకం

▸▸ పట్టించుకోని అధికారులు.. ప్రయాణికుల అగచాట్లు




మురుగుతో అధ్వానంగా తయారైన కృష్ణాదేవిపేట బస్ స్టేషన్ ఆవరణ... కాంప్లెక్స్‌లో నిరుపయోగంగా ఉన్న ట్యాంక్, ట్యాపులు

అధ్వాన పరిసరాలు.. మరమ్మతులకు గురైన బెంచీలు.. తిరగని ఫ్యాన్లు.. పనిచేయని తాగునీటి ట్యాపులు.. మొత్తానికి కానరాని కనీస సదుపాయాలు.. ఇదీ కృష్ణాదేవిపేట ఆర్టీసీ కాంపెక్స్‌లో దుస్థితి.

కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి):

గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట ఆర్టీసీ బస్ స్టేషన్‌లో ప్రయాణికులకు కనీసం సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. నిత్యం వంద గ్రామాల నుండి రాకపోకలు సాగించే ప్రయాణికులు, విద్యార్థులకు కనీసం తాగునీరు కూడా అందుబాటులో లేదు. అల్లూరి సీతారామరాజు వర్తక సంఘం ప్రతినిధులు నాలుగేళ్ల క్రితం రూ.30 వేలు వెచ్చించి ఆర్‌వో ప్లాంట్ వితరణ చేశారు. ఇది రెండేళ్లపాటు ప్రయాణికులకు పరిశుద్ధమైన తాగునీరు అందించేది.తర్వాత మరమ్మతులకు గురై మూలకు చేరింది. ఇది జరిగి నెలలు గడుస్తున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారు. అంతేకాకుండా బస్‌స్టేషన్ ఆవరణలో గోతులతో మెటల్ రోడ్డు ఉండడంతో బస్సులు వచ్చివెళ్లే సమయంలో ప్రయాణికులపై పడిపోయి గాయాల పాలైన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఈ విషయంపై పలుమార్లు ప్రయాణికులు ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు బస్‌స్టేషన్‌లో దోమల బెడద ఉంది. ప్రయాణికులు సేదతీర్చుకునే కుర్చీలు సరిపడకపోగా, ఉన్నవి మరమ్మతులకు గురయ్యాయి. వేసవి కావడంతో సీలింగ్ ఫ్యాన్లు కూడా లేక ప్రయాణికులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కాగా, 2016లో అప్పటి పంచాయతీరాజ్ శాఖా మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఈ గ్రామాన్ని దత్తతతీసుకుని బస్‌స్టేషన్ నిర్మాణం చేపట్టారు. టీడీపీ పాలనలో చేపట్టిన బస్‌స్టేషన్‌లో ఐదేళ్ల వైసీపీ పాలనలో కనీసం సీసీ రోడ్డు ఏర్పాటు చేయలేకపోవటం శోచనీయమని ప్రయాణికులు అంటున్నారు.ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి కాంప్లెక్స్‌లో సమస్యలు పరిష్కరించడంతో పాటు కనీస సదుపాయాలు కల్పించాలని వారు కోరుతున్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

▸▸ మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు, నాయకులు

దేవరాపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చెప్పారు. మండలంలోని వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాలకు శుక్రవారం ఆయన శ్రీకారం చుట్టారు. మండల కేంద్రంలో కెమిస్ట్రీ ల్యాబ్‌కు శంకుస్థాపన, కాశీపురం, నాగయ్యపేట, గ్రామాల్లో సీసీ రోడ్లు, రక్షిత నీటి పథకాలకు ప్రారంభోత్సవం చేశారు. వీరబద్రపేట రోడ్డు పనులను కూడా ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం దిశగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని చెప్పారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన వాటన్నింటినీ అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం యోచిస్తున్నదన్నారు. మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, పార్టీ మండల అధ్యక్షుడు సూర్యనారాయణ, జలాశయ ఛైర్మన్ పి.పాత్రునాయుడు, చరకాన సూర్యనారాయణ, సర్పంచ్‌లు పెంటమ్మ, ఆదిరెడ్డి వరలక్ష్మి, కర్రి పుష్ప, కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'కాటపల్లి'కి ఎమ్మెల్యే బండారు సత్కారం


అప్పారావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు, నాయకులు

దేవరాపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర స్థాయి అంబేడ్కర్ సేవా రత్న అవార్డు గ్రహీత కాటపల్లి అప్పారావును ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఇటీవల అవార్డు అందుకున్న అప్పారావును ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, రైవాడ జలాశయ ఛైర్మన్ పాత్రునాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు సూర్యనారాయణ, సర్పంచ్ పెంటమ్మ తదితరులు పాల్గొన్నారు.

భగీరథ జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని మంత్రికి వినతి


మంత్రి సవితకు వినతిపత్రం అందిస్తున్న నూకరాజు

నాతవరం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): భగీరథ జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని బీసీ సంక్షేమ శాఖా మంత్రి సవితకు వినతిపత్రం అందించినట్టు రాష్ట్ర బీసీసెల్ ఉపాధ్యక్షుడు గుర్రం నూకరాజు తెలిపారు. తమ విన్నపానికి మంత్రి సానుకూలంగా స్పందించారని చెప్పారు. రాష్ట్ర పండుగగా నిర్వహించడానికి అంగీకరించిన మంత్రికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అకాల వర్షం.. సేదదీరిన జనం


దేవరాపల్లిలో కురుస్తున్న వర్షం

దేవరాపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) ఎండ ప్రచండంతో అల్లాడుతున్న మండల ప్రజలు వరుణుడు కరుణతో సేదదీరారు. వాతావరణం ఒక్కసారిగా చల్లబడిపోవడంతో ఉపశమనం పొందారు. గత మూడు రోజులుకు బయటకు వెళ్లలేని ప్రజలకు శుక్రవారం సాయంత్రం ఉరుములుచ మెరుపులతో కూడిన వర్షం ఉపశమనం కల్పించింది. ఒక్కసారిగా వాతావరణం చల్ల బడడంతో జనం ఊపిరి పీల్చుకున్నారు. ఈ వర్షం పశుగ్రాసం, కూరకాయల పంటలకు ఉపయోగ పడుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మాడుగులలో..

మాడుగుల రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు రోజులుగా సాయంత్రం వేళల్లో చల్లని వాతావరణం నెలకొనడంతో ప్రజలు ఉపశమనం పొందుతున్నారు. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం మూడు గంటల వరకు ఎండ తీవ్రతరంగా ఉంటున్నది. ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్న క్రమంలో సాయంత్రం నాలుగు గంటల దాటిన తర్వాత వాతావరణం ఒక్కసారిగా మారిపోయి వర్షం కురుస్తుండడంతో ఉపశమనం పొందుతున్నారు.

కృష్ణాదేవిపేటలో...

కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట, లింగంపేట, విప్పలపాలెం, ఏఎల్‌పురం, చోద్యం, నాగాపురం, కొంగసింగి తదితర గ్రామాల్లో శుక్రవార మోస్తర వర్షం పడింది. ఎండతో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షం ఊరటనిచ్చింది. శుక్రవారం ఉదయం నుంచి ఎండతో అల్లాడిన ప్రజలకు సాయంత్రం ఒక్కసారి వాతావరణం చల్లబడి వర్షం పడడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

వేతనదార్ల సమావేశంలో మేట్లను నిర్ణయించాలి

చీడికాడ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధి వేతనదారులతో సమావేశంలోనే మేట్లను ఎంపిక చేయాలని ఎంపీపీ కురచా జయమ్మ, సర్పంచులు చుక్క అప్పలనాయుడు, వంటాకు నరసింహమూర్తి, వైసీపీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజబాబు తదితరులు మండల ప్రత్యేకాధికారి బీవీఎల్ఎస్.మూర్తికి, ఎంపీడీవో హేమసుందర్రావుకు వినతిపత్రం సమర్పించారు.

జిల్లాలో 309 పాఠశాలలకు ప్రహారీ గోడలు

రూ.21.2 కోట్లు మంజూరు: సర్వశిక్షా అభియాన్ ఈఈ నరసింహరావు


విలేకరులతో మాట్లాడుతున్న ఈఈ డి.వి.నరసింహరావు

దేవరాపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 309 ప్రభుత్వ పాఠశాలల ప్రహరీ గోడలు నిర్మించనున్నట్టు సర్వశిక్ష అభియాన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.వి.నరసింహారావు తెలిపారు. శుక్రవారం దేవరాపల్లి వచ్చినప్పుడు విలేకరులతో ఆయన మాట్లాడారు. వీటి నిర్మాణానికి జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా రూ21.2 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. దేవరాపల్లి, గొలుగొండ, మండలంలో ఏఎల్ పురం, అచ్యుతాపురం మండలంలో ప్రభుత్వ వసతి గృహం భవన నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించడం జరిగిందన్నారు. ప్రస్తుతం జిల్లాలో దేవరాపల్లి ఉన్నత పాఠశాల ఆవరణ బాలికల వసతి గృహం నిర్మాణానికి రూ.2.05 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఒక్కొక్క ల్యాబ్ నిర్మాణానికి 15.58 లక్షలు ఖర్చవుతుందన్నారు. కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో అదనపు భవన నిర్మాణానికి జిల్లాలో 13 బాలికల కళాశాలలో టెండర్లు పిలవడం జరిగిందన్నారు. ప్రస్తుతం మనబడి-మన భవిష్యత్ 2024-25లో 15.68 కోట్లు మంజూరు చేసి, దశల వారీగా పూర్తి చేయడానికి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆందోళన



పాత మునిసిపల్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న కార్మికులు

నర్సీపట్నం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్యం, నీటి సరఫరా విభాగాలలోలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించొద్దని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఆందోళనకు దిగారు. సీఐటీయూ అనుబంధం మునిసిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో పాత మునిసిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేసినట్టు చెప్పారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు కె.రాజు, వి.రమణ, అర్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫేర్‌వెల్ డే


అలరించిన విద్యార్థినుల నృత్య ప్రదర్శన

నర్సీపట్నం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రిషి డిగ్రీ కళాశాలలో ఫేర్‌వెల్ డేను ఘనంగా నిర్వహించారు. నర్సీపట్నంలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం జరిగిన వేడుకలలో విద్యార్థిని, విద్యార్థులు సినిమా పాటలకు ఉత్సాహంగా నృత్యాలు చేసి సందడి చేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ కె.సతీశ్ మాట్లాడుతూ క్రమశిక్షణ, ఏకాగ్రతతో చదవాలని విద్యార్థులకు సూచించారు. ఇక్కడ చదివిన ముగ్గురు విద్యార్థులు పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్లుగా ఉద్యోగం సాధించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీసీపీఈఎస్ జిల్లా అధ్యక్షుడు గాడి సూర్యప్రకాశ్, డైరెక్టర్ ఆర్‌వై నాయుడు, డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల వినూత్న నిరసన


గడ్డి నోటిలో పెట్టుకొని నిరసన తెలుపుతున్న కూలీలు

చీడికాడ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): చీడిపల్లి పంచాయతీ కేంద్రంలో ఉపాధి పథకం కూలీలు పెండింగ్ బిల్లులు చెల్లించాలన్న డిమాండ్‌తో శుక్రవారం వినూత్నంగా నిరసన తెలిపారు. కూలీలు నోటిలో గడ్డి పెట్టుకొని ఆందోళన చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న వీరికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న రూ.53 కోట్లు బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో పలువురు సంఘం నాయకులు, ఉపాధి మేట్లు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో బీఎల్‌వోలే కీలకం

నాతవరం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాలు తయారీలో బీఎల్‌వోలదే కీలక పాత్ర అని తహసీల్దార్ వి.వేణుగోపాల్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం బీఎల్‌వోలకు ఓటర్ల జాబితాపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా తయారీలో నిబంధనల మేరకు పని చేయాలన్నారు. ఒక కుటుంబంలో ఉన్న ఓటర్లంతా ఒకే కేంద్రంలో వచ్చేలా సరి చేయాలన్నారు. అలాగే ఫారం-6, 8 దరఖాస్తులను ఎలా సరి చేయాలనేది వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డీటీ సుధారాణి, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

నీలగిరి తోటలు దగ్ధం

రావికమతం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మరుపాక గ్రామ శివారులో రెండు ఎకరాల నీలగిరి తోటలు దగ్ధమయ్యాయి. మరుపాక మోడల్ స్కూల్‌ను ఆనుకుని ఉన్న ఈ తోటలు శుక్రవారం దారి పోయేవారు కాల్చి పారేసిన చుట్ట లేక సిగరెట్ కాల్చి పడేయడం వల్ల కాలిపోయాయి. గొర్లె సత్తిబాబు, రామరాజు, కన్నతల్లి, శ్రీనువాస్‌లకు చెందిన రెండు ఎకరాల నీలగిరి తోటలు కాలిపోయాయి. ప్రమాద సమాచారం రావికమతం అగ్నిమాపక కేంద్రానికి తెలిపినప్పటికీ మిట్ట మధ్యాహ్నం రావడంతో మొత్తం కాలిపోయాయని బాధిత రైతులు వాపోయారు.

మాడుగులలో 7న జాబ్‌మేళా

మాడుగుల ఏప్రిల్ 4 (ఆంధ్రజోతి): నిరుద్యోగ యువతీ, యువకులను దృష్టిలో పెట్టుకొని ఈ నెల 7వ తేదీన ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో మెగా ఉద్యోగమేళా నిర్వహించడం జరుగుతుందని మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న నిరుద్యోగులను దృష్టిలో పెట్టుకొని, వారికి ఉద్యోగ అకాశాలు కల్పించే విధంగా సోమవారం ఉదయం పది గంటల నుంచి మేళా ఉంటుందని చెప్పారు. ఈ విషయాన్ని నిరుద్యోగ యువతీ, యువకులు గమనించి ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఆయన కోరారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

మాడుగుల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మాడుగుల పురాతన సీతారామస్వామి ఆలయం వద్ద ఉత్తర ద్వార దర్శనానికి వెళ్లేందుకు సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ యడ్ల కళావతి ప్రారంభించారు. శ్రీరామ నవమిని దృష్టిలో పెట్టుకొని భక్తుల సౌకర్యార్థం సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జవ్వాది వరహాలు, మాజీ ఉప సర్పంచ్ శ్రీనాధ శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

రోలుగుంట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బీసీ, ఓసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి నిమిత్తం రాయితీ రణాల కోసం ఆన్‌లైన్ చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం కొత్తకోట, రోలుగుంట, నర్సీపట్నంకు చెందిన వివిధ బ్యాంకు అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించారు. ఈ ఇంటర్వ్యూలకు 400కు పైగా హాజరైనట్టు ఎంపీడీవో తెలిపారు. అర్హులైన వారికి ఎంపిక చేసి త్వరలోనే యూనిట్ల స్థాపనకు రాయితీ రుణాలను మంజూరు చేస్తామని ఆయన చెప్పారు.

కె.కోటపాడులో...

కె.కోటపాడు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీసీ కార్పొరేషన్ రుణాల దరఖాస్తుదారులకు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీవో సాంబశివరావు అధ్యక్షతన బ్యాంక్ అధికారులు దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలంలోని కె.కోటపాడు, చౌడువాడ, ఆనందపురం ఏపీజీబీ బ్యాంకు, లంకవానిపాలెంలోని ఇండియన్ బ్యాంక్, కె.కోటపాడు మండల కేంద్రంలోని భారతీయ స్టేట్ బ్యాంక్ అధికారులు దరఖాస్తుదారులతో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలంలోని 32 పంచాయతీల నుంచి 645 మంది దరఖాస్తులు చేసుకోగా 528 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అప్పలరాజు, స్థానిక ఎస్‌బీఐ మేనేజర్ పి.హరికృష్ణ, ఇతర బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

కుసర్లపూడి ఉన్నత పాఠశాలకు లైబ్రరీ రాక్స్ వితరణ

రోలుగుంట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కుసర్లపూడి జడ్పీ ఉన్నత పాఠశాలకు లైబ్రరీ రాక్స్‌ను శుక్రవారం వితరణగా అందించారు. పాల సంఘం మాజీ అధ్యక్షుడు పెద్దినాయుడు కుటుంబీకులు గేదెల మహాలక్ష్మినాయుడు, వెంకటేశ్, శివనారాయణ, కాశీ, శ్రీను తదితరులు వీటిని హెచ్ఎం మోహనరావుకు అందించారు. త్వరలోనే పాఠశాలకు స్పోర్ట్స్ మెటీరియల్ అందిస్తామని వారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అప్పన రాంబాబు, సీఆర్పీలు చిరంజీవి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మంచాలలో పాత మేట్లనే కొనసాగించాలి

చీడికాడ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మంచాల గ్రామంలోని ఉపాధి హామీ పథకంలో మేట్లుగా పనిచేస్తున్న పెద్దింటి సూర్యకళ, బోను రాజేశ్వరిలను కొనసాగించాలని ఆ రెండు గ్రూపులకు చెందిన పలువురు కూలీలు చీడికాడ ఎంపీడీవో కార్యాలయానికి వచ్చి అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ ఉపసర్పంచ్ కసిరెడ్డి రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధి పథకంలో మేట్లు వ్యవస్థ ఏర్పాటు నుంచి నేటి వరకూ సక్రమంగా పనులు జరుగుతున్నాయని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో కొంత మంది నాయకులు మేట్లను మారుస్తామని అలజడి సృష్టిస్తున్నారని, దీన్ని ఖండించి పాత మేట్లునే కొనసాగించాలని ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై ఎంపీడీవో హేమసుంద్రరావు మాట్లాడుతూ, ఉపాధి కూలీలతో సమావేశం ఏర్పాటు చేసిచ వారి నిర్ణయం మేరకు మేట్లను కొనసాగిస్తామని హామీ ఇచ్చారు.

సీతారాముల పెళ్లి రాట

దేవరాపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.అలమండ గ్రామంలో శ్రీరామ నవమి సందర్భంగా శుక్రవారం పెళ్లిరాట వేశారు. శ్రీరామ నామస్మరణతో సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహించినట్టు సర్పంచ్ దాడి జగన్నాథరావు తెలిపారు.


అలమండలో పెళ్లి రాట వేస్తున్న సర్పంచ్, గ్రామస్థులు

బియ్యం గింజలపై 'శ్రీరామ' అక్షరాలు

» ఆరేళ్ల నుంచి లిఖిస్తున్న 'నాగులాపల్లి' యశోద

» సీతారాముల కల్యాణోత్సవానికి తలంబ్రాలుగా సమర్పణ



బియ్యం గింజలపై 'శ్రీరామ' అక్షరాలు రాస్తున్న యశోద





'శ్రీరామ' అని లిఖించిన బియ్యం గింజలు

మునగపాక, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పట్టుకుంటే జారిపోయేలా వుండే బియ్యం గింజపై ఒక్క అక్షరం రాయాలన్నా ఎంతో కష్టం. అటువంటిది నాగులాపల్లికి చెందిన కర్రి యశోద ఏకంగా ఆరున్నర వేలకుపైగా బియ్యం గింజలపై 'శ్రీరామ' అని సూక్ష్మ రూపంలో అక్షరాలను లిఖించారు. ఆధ్యాత్మిక భావాలు మెండుగా వున్న ఆమె గత ఆరేళ్ల నుంచి శ్రీరామనవమి సందర్భంగా 'శ్రీరామ' అని రాసిన బియ్యం గింజలను సీతారాముల కలాణోత్సవానికి తలంబ్రాలుగా సమర్పిస్తున్నారు. ఈ ఏడాది 6,666 బియ్యం గింజలపై 'శ్రీరామ' అని లిఖించారు. వీటిని ఆదివారం స్వగ్రామం నాగులాపల్లితోపాటు కన్నవారి ఊరైన తిమ్మరాజుపేట రామాలయాల్లో జరిగే సీతా రాముల కల్యాణోత్సవానికి తలంబ్రాలుగా అందజేస్తున్నట్టు యశోద చెప్పారు.

కండిషనల్ బెయిల్‌పై కర్రి శ్రీను విడుదల

» 60 రోజుల వరకు నంద్యాల దాటి వెళ్లవద్దని ఆదేశం



జలదుర్గం పోలీస్ స్టేషన్ వద్ద కర్రి శ్రీను

నర్సీపట్నం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడుని దూషించిన కేసులో నంద్యాల జిల్లా జలదుర్గం పోలీసులు అరెస్టు చేసిన వైసీపీ నాయకుడు కర్రి శ్రీనివాసరావు కండిషనల్ బెయిల్‌పై విడుదల అయ్యారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడుపై అనుచిత వ్యాఖ్యలు చేయడం, చంపుతానని బెదిరించడాన్ని సోషల్ మీడియాలో చూసి నంద్యాల జిల్లా డోన్ నియోజకవర్గం జలదుర్గం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు దూదేకుల హుస్సేన్ మార్చి 6న కర్రి శ్రీనివాసరావుపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం జలదుర్గం పోలీసులు, నర్సీపట్నం పోలీసుల సాయంతో శారదానగర్‌లో ఉన్న కర్రి శ్రీనివాసరావును అరెస్టు చేసి, డోన్ కోర్టులో హాజరు పరిచారు. జడ్జి ఆయనకు కండిషనల్ బెయిల్ మంజూరు చేశారు. 60 రోజుల వరకు నంద్యాల జిల్లా పరిధి దాటి వెళ్లవద్దని, వారంలో మూడు రోజులు జలదుర్గం పోలీస్ స్టేషన్‌లో హాజరు కావాలని ఆదేశించారు.

అదృశ్యమైన బాలిక ఆచూకీ లభ్యం

రావికమతం, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన బాలిక గురించి ఫిర్యాదు అందిన 24 గంటల్లోనే పోలీసులు ఆచూకీ కనుగొని తల్లిదండ్రులకు అప్పగించారు. కొత్తకోట ఎస్‌ఐ శ్రీనివాస్ అందించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని జెడ్.కొత్తపట్నం గ్రామానికి చెందిన బాలిక ఈ నెల ఒకటో తేదీన అదే గ్రామానికి చెందిన ఒక బాలుడితో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయింది. బాలిక కోసం తల్లిదండ్రులు, బంధువులు రెండు రోజులపాటు గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో మూడో తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ శ్రీనివాస్ సాంకేతికతను వినియోగించి అదృశ్యమైన బాలిక లంబసింగి శివారు ఏజెన్సీ ప్రాంతంలో ఉన్నట్టు గుర్తించారు. వెంటనే అక్కడకు వెళ్లి బాలికను తీసుకొచ్చి శుక్రవారం రాత్రి తల్లిదండ్రులకు అప్పగించారు. ఫిర్యాదు అందిన 24 గంటల్లోనే బాలిక ఆచూకీని అప్పగించిన ఎస్‌ఐ శ్రీనివాస్‌కు, పోలీసు సిబ్బందికి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

మైనారిటీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

విశాఖపట్నం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మైనారిటీ అభ్యర్థులకు వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ అందించనున్నామని జిల్లా అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమశాఖాధికారి ఎం.సత్యపద్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని ముస్లిం, క్రిస్టియన్, బీసీ సి, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శీలకు ఏపీ ఈఏపీసెట్ (ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ), డీఎస్సీ ప్రవేశ పరీక్షలకు నగరంలోని ప్రైవేటు కోచింగ్ సెంటర్లలో ఉచిత శిక్షణ అందిస్తామన్నారు. ఆసక్తి గల వారు ఫొటో, ఆధార్ కార్డుతో సిరిపురంలోని డాల్ఫిన్ హైట్స్ అపార్టుమెంట్, ఫ్లాట్ నంబరు 308, మూడో అంతస్థులోని కార్యాలయంలో ఈ నెల ఆరో తేదీలోగా దరఖాస్తులను సమర్పించాలన్నారు.వివరాలకు ప్రాజెక్టు అధికారి 79931 85662, సంబంధిత శాఖా కార్యాలయం 86398 40344 నంబర్లలో సంప్రతించాలన్నారు.

డైట్‌లో డిప్యూటేషన్‌పై అధ్యాపకుల నియామకం

భీమునిపట్నం ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశిక్షణా సంస్థ (డైట్)లో అధ్యాపక పోస్టులను డిప్యూటేషన్‌పై నియమించేందుకు నోటిఫికేషన్ జారీ చేశామని ప్రిన్సిపాల్ జ్యోతికుమారి తెలిపారు. వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న అర్హత కలిగిన ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 16, 17 తేదీల్లో రాతపరీక్ష, 19న మౌఖిక పరీక్ష నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తామన్నారు.

విశాఖలో 3 వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లు

» మధురవాడ, ముడసర్లోవ, గాజువాకల్లో ఏర్పాటు

విశాఖపట్నం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాలు చేసే మహిళల కోసం నగరంలో హాస్టళ్ల ఏర్పాటుకు కేంద్రం ముందుకువచ్చింది. ప్రధానంగా అవివాహితులు, ఒంటరి మహిళల కోసం మూడుచోట్ల వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్ల నెలకొల్పడానికి రూ.178 కోట్లు మంజూరుచేసింది. జిల్లా యంత్రాంగం చేసిన ప్రతిపాదనల మేరకు కేంద్రం ఈ నిధులు కేటాయించింది. మధురవాడ, ముడసర్లోవ, గాజువాకల్లో ఈ వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్ల ఏర్పాటుచేయాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. ఒక్కొక్క హాస్టల్‌లో తొలిదశలో 350 మందికి వసతి కల్పించనున్నారు. భవిష్యత్తులో వసతి సౌకర్యాన్ని మరింత పెంచేలా నిర్మాణాలు చేపడతారు. మూడు హాస్టళ్ల నిర్మాణం పూర్తయిన తరువాత పీపీపీ విధానంలో నిర్వహించనున్నారు. ముడసర్లోవలోవ హాస్టల్‌ను ఆరిలోవ హెల్త్ సిటీలోని ఆస్పత్రుల యాజమాన్య కమిటీ, అలాగే మధురవాడ హాస్టల్‌ను ఐటీ కంపెనీల అసోసియేషన్, గాజువాక హాస్టల్‌ను ఫార్మా కంపెనీల అసోసియేషన్ నిర్వహించేలా ఒప్పందాలు చేసుకునే యోచనలో ఉన్నారు.

రోడ్డు పనులతో ట్రాఫిక్ సమస్య

కాంట్రాక్టర్ నిర్వాకంతో ప్రయాణికుల పాట్లు

» రహదారిపైనే ఇసుక, కంకర డంపింగ్

» మరోవైపు సగం రోడ్డుపై సిమెంట్ కాంక్రీట్ పనులు

» వాహనాల మళ్లింపునకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయని అధికారులు



ఎం.కోటపాడు వద్ద రహదారిపై ఇసుక, కంకర కుప్పలు



సీసీ రోడ్డు నిర్మిస్తుండడంతో నిలిచిపోయిన వాహనాలు

మాడుగుల రూరల్, ఏప్రిల్ 4:

బుచ్చెయ్యపేట మండలం వడ్డాది నుంచి మాడుగుల మండలం తాటిపర్తి వరకు రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులు చేపట్టిన కాంట్రాక్టర్ వ్యవహరిస్తున్న వైఖరి కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముకుందపురం, కేజేపురం జంక్షన్, ఎం.కోటపాడు, ఎంకే వల్లాపురం, సురవరం, ఎంకోడూరు గ్రామాల వద్ద సీసీ రోడ్డు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఎం.కోటపాడు వద్ద గ్రామ పరిధిలో సీసీ రోడ్డు పనులు జరుగుతున్నాయి. మొత్తం రోడ్డు వెడల్పు ఏడు మీటర్లు కాగా.. ఇందులో సగభాగం సీసీ రోడ్డు వేస్తున్నారు. మిగిలిన సగం రోడ్డులోనే వాహనాలు వెళ్లాల్సి వస్తున్నది. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు ప్రధాన రహదారి కావడంతో వాహనాల రద్దీ అధికంగా వుంది. సుమారు పది అడుగుల దారి మాత్రమే వుండడంతో ఒకవైపు వాహనాలు వెళ్లిన తరువాత, రెండో వైపు వాహనాలు వెళ్లాల్సి వస్తున్నది. భారీ వాహనాలు వచ్చినప్పుడు ట్రాఫిక్ స్తంభిస్తున్నది. సీసీ రోడ్డు నిర్మించే ప్రదేశానికి కొంచెం దూరంలో ఇసుక, కంకరను రోడ్డుపై కుప్పలుగా నిల్వచేశారు. ఇక్కడ కూడా వాహనాలు ఒక వరుసలోనే వెళ్లాల్సి వస్తున్నది. వాహనాలను వేరే మార్గంలో మళ్లించడానికి అధికారులు ఏర్పాట్లు చేయకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



ఎం.కోటపాడు వద్ద స్తంభించిన ట్రాఫిక్

ఆర్థిక బలోపేతానికి సబ్సిడీ రుణాలు

» గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న సురేంద్ర



హాజరైన దరఖాస్తుదారులు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రజలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని, దీంట్లో భాగంగానే బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు పంపిణీ చేస్తున్నదని గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర అన్నారు. స్థానిక ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న జీవీఎంసీ అనకాపల్లి జోన్ పరిధిలోని వారికి శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సురేంద్ర మాట్లాడుతూ, ప్రభుత్వం 50 శాతం రాయితీతో రుణాలు మంజూరు చేస్తుందని, వీటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని పిలుపునిచ్చారు. మెప్మా ఏపీడీ యల్లపు సంతోష్‌కుమార్ మాట్లాడుతూ, రుణాల కోసం 854 మంది దరఖాస్తు చేసుకున్నారని, ప్రస్తుతం 177 మందికి రుణాలు మంజూరు అవుతాయని చెప్పారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ, రాయితీ రుణాలతో వ్యాపారాలు చేసి ఆర్థికంగా ఎదగడంతోపాటు మరికొంతమందికి ఉపాధి కల్పించేలా చూడాలన్నారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తే మరోసారి రుణాలు ఇవ్వడానికి అవకాశముంటుందన్నారు. ఈ కార్యక్రమంలో యూబీఐ తుమ్మపాల బ్రాంచి మేనేజర్ ధీరజ్, గవరపాలెం బ్యాంకు ప్రతినిధి శృతి, ఎస్‌బీఐ ప్రతినిధి భారతిదేవి, కూటమి నాయకులు బీఎస్ఎంకే జోగినాయుడు, విల్లూరి హరి, ఆళ్ల రామచంద్రరావు, బుద్ద శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూ వైరస్‌పై పరిశోధన

డాక్టరేట్ అందుకున్న రైతు బిడ్డ పరదేశినాయుడు





డాక్టరేట్ పట్టాను అందుకుంటున్న ఆదిరెడ్డి పరదేశినాయుడు

దేవరాపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాశీపురానికి చెందిన ఆదిరెడ్డి పరదేశినాయుడు డెంగ్యూ వైరస్‌పై చేసిన పరిశోధనకు చెన్నైలోని భారత్ యూనివర్సిటీ పీహెచ్‌డీ డాక్టరేట్‌ని ప్రదానం చేసింది. శుక్రవారం తమిళనాడు ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ గోవి చెజియాన్ చేతుల మీదుగా పరదేశినాయుడు పీహెచ్‌డీడాక్టరేట్‌ను అందుకున్నారు. ఇతను అనంతపురంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో గత 18 ఏళ్లుగా మైక్రో బయాలజీ అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. ఓవైపు మెడిసిన్ విద్యార్థులకు మైక్రో బయాలజీ పాఠ్యాంశాలను బోధిస్తూ.. మరోవైపు వారిని సమాజ సేవకులుగా తీర్చిదిద్దినందుకు 2019లో అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా ఉత్తమ జాతీయ సేవా పథకం అధికారిగా అవార్డు, సిల్వర్ మెడల్, ప్రశంసాపత్రం, రూ.70 వేల నగదు బహుమతి అందుకున్నారు. గత ఏడాది ఆంధ్రా యూనివర్సిటీలో ఎంబీఏ (హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్) ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు. తన బిడ్డ డాక్టరేట్ అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందని పరదేశినాయుడు తండ్రి అక్కునాయుడు అన్నారు.

రోడ్డు పనుల్లో నాణ్యతాలోపం

... 5వ పేజీ తరువాయి

గోతులు ఏర్పడి అధ్వానంగా తయారైంది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత రహదారులపై గోతులు పూడ్చి నిర్వహణ పనులు చేపట్టాలని పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ శాఖలను ఆదేశించింది. దీంతో ఆర్అండ్‌బీ అధికారులు అంచనాలు తయారు చేసి ఎలమంచిలి బైపాస్ రోడ్డులో పెట్రోలు బంకు నుంచి సైతారుపేట రోడ్డు జంక్షన్ వరకు ఫిబ్రవరిలో మరమ్మతు పనులు చేయించారు. దీంతో గోతుల సమస్య తొలగిందని ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రజలు ఆనందించారు. కానీ వీరి ఆనందం పట్టుమని పది రోజులు కూడా నిలవలేదు. ప్యాచ్ వర్క్ చేసిన చోట తారు లేయర్‌తోసహా మెటల్‌లేచిపోయి గోతులు బయటపడుతున్నాయి. సాధారణంగా వర్షాకాలంలో తారు రోడ్లు పాడవుతుంటాయి. కానీ బైపాస్ రోడ్డుకు ప్యాచ్ వర్క్ చేసిన తరువాత ఒక్కసారి కూడా వర్షం కురవలేదు. అయినప్పటికీ ప్యాచ్ వర్క్ చేసినచోట తారు, రాళ్ల లేచిపోయి పరిస్థితి మళ్లీ మొదటికొస్తున్నది. పనుల్లో నాణ్యత లోపించడమే ఇందుకు కారణమని వాహనదారులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తేవాలన్న ఉద్దేశంతోనే అధికారులు ఇలా వ్యవహరిస్తున్నట్టుగా వుందని స్థానికులు ఆరోపిస్తున్నారు.



బైపాస్ రోడ్డులో గొయ్యి కప్పిన చోట కుంగిన రోడ్డు

క్రైం... crime news

వృద్ధురాలి అదృశ్యం



గురి మహాలక్ష్మి (ఫైల్ ఫొటో)

సబ్బవరం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగలిపురం బండమ్మతల్లి ఆలయం సమీపంలో నివసిస్తున్న గురి మహాలక్ష్మి (80) అదృశ్యమైనట్టు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈమెకు చిన్నవయసులోనే వివాహం జరగడం, కొద్ది రోజులకే భర్త నుంచి విడిపోవడంతో అప్పటి నుంచి సోదరి గురి లక్ష్మి వద్ద వుంటున్నది. మతిస్థిమితం సరిగా లేని ఆమె గత నెల 11వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. పలుచోట్ల గాలించినా ఫలితం లేకపోవడంతో సోదరుడు గురి దేముడు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ పిన్నింటి రమణ తెలిపారు.

కలుపు నివారణ మందు తాగి ఆత్మహత్య

నక్కపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన ఓ వ్యక్తి తీవ్ర అనారోగ్యానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్‌ఐ సన్నిబాబు తెలిపిన వివరాలిలా వున్నాయి. నక్కపల్లి ఎస్సీ కాలనీకి చెందిన బద్దా నానిబాబు (38) మద్యం సేవించే అలవాటు వుంది. అతిగా మద్యం తాగడంతో తీవ్రఅనారోగ్యానికి గురయ్యాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన అతను గురువారం పొలాల్లో కలుపు నివారణకు పిచికారీ చేసే మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు నక్కపల్లి ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించగా శుక్రవారం ఉదయం మృతిచెందాడు. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ చెప్పారు.

బస్సు ఢీకొని రైతుకు తీవ్రగాయాలు

అచ్యుతాపురం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగులూరు జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ వెంకటరావు తెలిపిన వివరాల ప్రకారం.. దుప్పితూరు గ్రామానికి చెందిన రైతు నీరుకొండ స్వామినాయుడు (60) సొంత పనిమీద ద్విచక్ర వాహనంపై అచ్యుతాపురం వస్తున్నాడు. దారిలో జంగులూరు జంక్షన్ వద్ద సెజ్‌లోని ఒక కర్మాగారం నుంచి ఉద్యోగులను తీసుకువస్తున్న బస్సు, బైక్‌ను ఢీకొంది. దీంతో స్వామినాయుడు తలకు తీవ్రగాయమైంది. చికిత్స నిమిత్తం అచ్యుతాపురంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

రబీ పంటలకు సస్యరక్షణ సూచనలు



పొట్ట, గింజకట్టే దశలో వున్న వరి

అనకాపల్లిఅగ్రికల్చర్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ మండలాల్లో ప్రస్తుత రబీలో సాగు చేస్తున్న పంటలకు సంబంధించి సస్యరక్షణ చర్యలు, ఎరువులు, క్రిమి సంహారక మందుల వినియోగం, పంట కోత వివరాలను అనకాపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ ముకుందరావు శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. చిరుపొట్ట దశ నుంచి గింజ గట్టిపడే దశలో ఉన్న వరి పొలాల్లో ఐదు సెంటీమీటర్ల లోతు వరకు నీరుండేలా చూడాలని సూచించారు. ఈ వారం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉండి తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉన్నందున కోత దశలో ఉన్న వరి పైరును కోయడం వాయిదా వేసుకోవడం మంచిదన్నారు.

నువ్వు పంటను కాయ తొలిచే పురుగు ఆశిస్తున్నందున వీటి నివారణకు క్లోరిపైరిఫాస్ మందును లీటరు నీటికి 2.5 మిల్లీ లీటర్ల చొప్పున పిచికారీ చేయాలని సూచించారు. వేరుకుళ్లు, కాండం కుళ్లు ఆశిస్తే కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా మెంకోజెబ్‌ను లీటరు నీటికి మూడు గ్రాముల చొప్పున కలిపి మొక్క మొదళ్లు తడిచేలా పిచికారీ చేయాలన్నారు. టమాటాలో పూత, పిందెరాలడాన్ని నివారించేందుకు ఒక మిల్లీ లీటరు ప్లానోఫిక్స్ మందును 4.5 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని ముకుందరావు సూచించారు.

ఆర్ఏఆర్ఎస్‌లో అమ్మకానికి చెరకు నారు మొక్కలు

అనకాపల్లి అగ్రికల్చర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ పరిశోధనా స్థానంలో చెరకు నారు మొక్కలు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయని చెరకు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ డి.ఆదిలక్ష్మి తెలలిపారు. ఒక్కో నారు మొక్క ఖరీదు రూ.2 అని, ఆర్ఏఆర్ఎస్‌లో సుమారు 25 వేల నారు మొక్కలు వున్నాయని వెల్లడించారు. కార్సి తోటల్లో ఖాళీలు నింపేందుకు నేరుగా పొలాల్లో నాటేందుకు ఈ నారు మొక్కలు ఉపయోగపడతాయని ఆమె చెప్పారు.

15, 16 తేదీల్లో జోనల్ పరిశోధన, విస్తరణ సమావేశాలు

అనకాపల్లి అగ్రికల్చర్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఉత్తర కోస్తా జోన్ వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశాలు ఈ నెల 15, 16 తేదీల్లో విజయనగరంలో జరుగుతాయని ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ సీహెచ్ ముకుందరావు శుక్రవారం తెలిపారు. ఈ జోన్‌లోని అనకాపల్లి, ఎలమంచిలి, విజయనగరం, ఆమదాలవలస, రాగోలు వ్యవసాయ పరిశోధన కేంద్రాల్లో జరుగుతున్న వివిధ పరిశోధనలు, విస్తరణ కార్యక్రమాలపై ఈ సమావేశాల్లో సమీక్షిస్తారన్నారు. రైతుల అవసరాల ప్రాతిపదికగా కొత్త పరిశోధనలకు ప్రణాళికలు రూపొందిస్తారని, జోన్‌లోని వ్యవసాయ శాస్త్రవేత్తలు, కృషి విజ్ఞాన కేంద్రాల శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

కిరండూల్ రైళ్లు దంతెవాడ వరకే

విశాఖపట్నం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కేకే లైనులో బచేలి-కిరండూల్ సెక్షన్‌లో భద్రత ఆధునికీకరణ, జగదల్‌పూర్-కిరండూల్ సెక్షన్‌లో డబ్లింగ్ పనుల నేపథ్యంలో విశాఖ-కిరండూల్ మధ్య రాకపోకలు సాగించే రైళ్లు తాత్కాలికంగా విశాఖ-దంతెవాడ మధ్య నడుస్తాయని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. దీంతో విశాఖ-కిరండూల్ (58501) పాసింజర్, విశాఖ-కిరండూల్ (18515) ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈ నెల 14 వరకు, విశాఖ-కిరండూల్ (58502) పాసింజర్, విశాఖ-కిరండూల్ (18516) ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 5 నుంచి 15 వరకు విశాఖ-దంతెవాడ మధ్య రాకపోకలు సాగిస్తాయని పేర్కొన్నారు. దంతెవాడ-కిరండూల్ మధ్య రాకపోకలను తాత్కాలికంగా రద్దు చేశామన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	108.00
లైవ్ ధర	127.00
విత్ స్కిన్	224.00
స్కిన్ లెస్	234.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	440
విజయనగరం	444
శ్రీకాకుళం	444

పంచాయతీల విద్యుత్ బకాయిలు రూ.121 కోట్లు

... 5వ పేజీ తరువాయి

రావాల్సిన విద్యుత్ బకాయిలు ఇలా ఉన్నాయి. బుచ్చెయ్యపేట రూ.2,32,75,449, చీడికాడ రూ.1,46,16,887, మాడుగుల రూ.1,78,83,257, రావికమతం రూ.1,86,14,876, చోడవరం రూ.3,44,43,073, దేవరాపల్లి రూ.89,22,161, కె.కోటపాడు రూ.1,61,91,409, వెంకన్నపాలెం (చోడవరం రూరల్) రూ.4,42,77,748, గొలుగొండ రూ.1,64,67,383, కోటవురట్ల రూ.2,71,43,295, నాతవరం రూ.2,59,84,561, మాకవరపాలెం రూ.2,07,32,700, రోలుగుంట రూ.1,34,,50446, నర్సీపట్నం 10,42,593 చొప్పున మొత్తం రూ.28,30,45,838 బకాయిలు చెల్లించాలి.

నర్స్ పోస్టులకు ఫేక్ సర్టిఫికెట్లు!

... 5వ పేజీ తరువాయి

ప్రక్రియను పూర్తి చేశామని, కొందరు అభ్యర్థుల సర్టిఫికెట్లపై స్పష్టత వచ్చిన వెంటనే జాబితా ప్రకటిస్తామని అధికారులు వెల్లడించారు. ఫైనల్ మెరిట్ లిస్టుపై అభ్యంతరాలు ఉంటే స్వీకరించి నివృత్తి చేసిన తరువాతే సెలక్షన్ లిస్టు పెడతామని ఆర్డీ రాధారాణి వెల్లడించారు.

రంగంలోకి దళారులు

నియామక ప్రక్రియ తుది దశకు చేరుకోవడంతో కొందరు దళారులు రంగ ప్రవేశం చేశారు. ఇప్పటికే అభ్యర్థుల నుంచి కొందరు డబ్బులు వసూలు చేసినట్టు ప్రచారం జరుగుతోంది. మెరిట్‌లో ఉన్న అభ్యర్థుల వివరాలను సేకరించి, వారికి ఫోన్లు చేసి డబ్బులు ఇస్తే ఉద్యోగం వచ్చేలా చేస్తామంటూ బేరసారాలు సాగిస్తున్నట్టు చెబుతున్నారు. ఇదే విషయం ఉన్నతాధికారుల దృష్టికి కూడా వెళ్లింది. ఉద్యోగాలు ఇప్పిస్తామని ఎవరైనా చెబితే నమ్మవద్దని, అటువంటి వారిపై ఫిర్యాదులు చేయాలని ఆర్డీ పి.రాధారాణి కోరుతున్నారు. మెరిట్ ప్రాతిపదికనే ఉద్యోగాలు వస్తాయని, అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్న తరువాత ఎంపిక చేస్తున్నట్టు తెలిపారు. దీనిపై ఎవరూ అపోహలు పెట్టుకోవద్దని సూచించారు. దళారులను నమ్మి మోసపోవద్దని పేర్కొన్నారు.